మంచిమాటలు
* జాలి పడి ఇచ్చే పలకరింపులకి, ప్రేమకి జోలె పట్టకు
* భారం అనుకునే చోట భావాలు పంచుకోకు..!
* దూరం నెట్టేసే చోట దగ్గరవ్వాలని ప్రయత్నించకు..!
* నిజాయితీని గుర్తించని చోట నిమిషం కూడా వృథా చేయకు..!
* ఆత్మాభిమానాన్ని మించిన ధనం ఈ ప్రపంచంలో మరొకటి వుంటుందని భ్రమపడకు..!
* ఎదురుచూడని ఇంటికి పిలిచినా వెళ్ళకు..!
* నీది కాని దేని మీదా నిన్ను తినేసేంత ప్రేమ, అభిమానం ఏదీ పెంచుకోకు

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur
RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 128 విశాఖపట్నం, 22 ఫిబ్రవరి 2026 ఆదివారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00



## పార్కు, స్టేడియం, స్విమ్మింగ్‌పూల్‌కు రూ.50 వేల కోట్లు?

### చంద్రబాబు చిరునవ్వులు

**పల్నాడు, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 21 :** పల్నాడు జిల్లా వినుకొండలో సీఎం చంద్రబాబు పర్యటనలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఎం బహిరంగ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రసంగిస్తూ.. వినుకొండలో పార్కు, స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం కోసం రూ.50 వేల కోట్లు నిధులు కేటాయించాలని అన్నారు. అది విన్న సీఎం చంద్రబాబు నవ్వులు చిందించారు. అనంతరం ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను సరిదిద్దుకొని రూ.50 కోట్లు కేటాయించాలని కోరారు.

## వేలానికి బుట్టా రేణుక దంపతుల ఆస్తులు



**కర్నూలు, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 21 :** కర్నూలు వైకాపా మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఆమె భర్త నీలకంఠ శివల ఆస్తులను వేలం వేయాలని ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ నిర్ణయించింది. ఆ సంస్థ నుంచి వారు గతంలో సుమారు రూ.340 కోట్ల రుణం తీసుకున్నారు. కొంతకాలం వాయిదాలు చెల్లించినా, తర్వాత మానేశారు. దీంతో రూ.782.07 కోట్ల వరకు బకాయిపడ్డారు. నోటీసులు పంపినా ఇరువర్గాలకు ప్రత్యామ్నాయ ఒప్పందం కుదరలేదు. దీంతో వారు తనఖా పెట్టిన ఆస్తులను వేలం వేసే ప్రక్రియను ప్రారంభించారు. తాజాగా హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలోని సర్వే నంబరు 1009, ఫేజ్-6లో వారికి ఉన్న 3,833.28 చదరపు గజాల స్థలాన్ని వేలం వేసేందుకు ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ బెంగళూరు బ్రాంచి శుక్రవారం వేలం ప్రకటన జారీచేసింది. అందులో మెరిడియన్ పాఠశాల భవనం కూడా ఉంది. ఆ ఆస్తి విలువ రూ.65 కోట్లుగా నిర్ణయించారు. ఈ ఏడాది మార్చి 23 వరకు ఈ-బిడ్ ఫారం దాఖలు చేసేందుకు అనుమతించి మార్చి 24న ఈ-వేలం వేస్తామని ప్రకటించారు.

## దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా యూత్ కాంగ్రెస్ వ్యవహారశైలి

### లావు శ్రీకృష్ణదేవరాయలు

**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 21 :** యూత్ కాంగ్రెస్ నేతలు ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ఆందోళన చేసి దేశ ప్రతిష్ఠను దెబ్బతీశారని తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవమానకర చర్య అంతర్జాతీయ వేదికపై దేశాన్ని నవ్వులపాలు చేసిందని శుక్రవారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు దేశం కంటే స్వార్థ ప్రయోజనాలే ఎక్కువని మండిపడ్డారు. ఈ ఘటనను వైకాపా ఖండించకపోవడాన్ని తప్పుబట్టారు. అందుకే ఆ పార్టీని పిల్ల కాంగ్రెస్ అంటారని ఎద్దేవా చేశారు.

## ఏఐ సమిట్‌లో 'కృష్ణార్జునులు'

**ఢిల్లీ :** దిల్లీలో జరుగుతోన్న ఏఐ సమిట్‌లో కృష్ణార్జునుల హైటెక్ డిజిటల్ రూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రిలయన్స్‌కు చెందిన జియో ఇంటెలిజెన్స్ విభాగం అత్యాధునిక హోలోగ్రామ్ టెక్నాలజీ, కృత్రిమ మేధను ఉపయోగించి భారతీయ ఇతిహాసాలకు సంబంధించిన ఈ చిత్రాలను రూపొందించింది. 'మహాభారత్: ఏక్ ధర్మ్ యుద్ధ్' సిరీస్‌లోని పలు పాత్రల డిజిటల్ రూపాలను ఈ సదస్సులోని తమ స్టాల్‌లో ప్రదర్శించింది. కృష్ణుడు, అర్జునుడు, ఇతరుల రూపాలతో సందర్శకులు మాట్లాడేలా ఏర్పాట్లు చేసింది.

సందర్శకులు అడిగిన పలు ప్రశ్నలకు కృష్ణుడు, అర్జునుడి డిజిటల్ రూపాలు సమాధానం ఇస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా, మన ఇతిహాసాలపై యువతకు ఆసక్తి కలిగించాలనే ఉద్దేశంతో ఈ ఏఐ ప్రాజెక్టును రూపొందించినట్లు జియో ఇంటెలిజెన్స్ స్టాల్ నిర్వాహకులు పేర్కొన్నారు. 'మహాభారత్: ఏక్ ధర్మ్ యుద్ధ్' సిరీస్ జియో హాట్‌స్టార్‌లో అందుబాటులో ఉందన్నారు.

# భారత్-బ్రెజిల్ ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం 20 బిలియన్ డాలర్లు



**న్యూఢిల్లీ :** భారత్ పర్యటనలో ఉన్న బ్రెజిల్ అధ్యక్షుడు లూలాడ సిల్వాతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. కీలక ఖనిజాలు, భద్రతా అంశాలపై దృష్టిపెట్టిన ఇరువురు నేతలు.. బహుముఖ సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. వచ్చే ఐదేళ్లలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం 20 బిలియన్ డాలర్లకు మించి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

లాటిన్ అమెరికాలో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా బ్రెజిల్ ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. లూలా స్ఫూర్తిదాయక నాయకత్వం, దార్శనికతతో ఇరు దేశాలు ప్రయోజనం పొందుతున్నాయని, ఇది విన్-విన్ భాగస్వామ్యమని అభివర్ణించారు. ఈ రెండు దేశాలు కలిసి పనిచేస్తే.. దక్షిణార్ధ గళం మరింత బలపడుతుందన్నారు. ఉగ్రవాదం, దానికి మద్దతిచ్చేవారు మానవాళికి శత్రువులని ఈ రెండు దేశాలు అంగీకరిస్తున్నాయని చెప్పారు.

**ఇక ఇజ్రాయెల్ బాణంతో భారత్ గురి..?**

గతేడాది జులైలో ప్రధాని మోదీ బ్రెజిల్‌లో పర్యటించడం ఇరుదేశ సంబంధాల్లో ఓ మైలురాయి అని సిల్వా పేర్కొన్నారు. ఇప్పటికే ఐదు రంగాల్లో ద్వైపాక్షిక సహకార అజెండాను పునర్నిర్మించుకున్నామని, తాజాగా ఇరు దేశాల భాగస్వామ్యానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పలు ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ఐటీ, ఏఐ, బయోటెక్నాలజీ, అంతరిక్ష ప్రయోగాలు వంటి అత్యాధునిక రంగాల్లో భారత్ ఎంతో పురోగతి సాధిస్తోందని, ఇవి బ్రెజిల్‌కు ఎన్నో అవకాశాలు కల్పిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ట్రంప్‌నకు చుక్కలు చూపించిన బొమ్మల కంపెనీ

**అమెరికా :** ప్రపంచ దేశాలపై విధించిన సుంకాల విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అమెరికా సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. సుప్రీం తీర్పు వెనక ఒక బొమ్మల కంపెనీ పోరాటం ఉంది. సుంకాల పిడుగుతో మనుగడే కోల్పోయే దశ నుంచి.. అది మళ్లీ ఊపిరి పోసుకుంది.

**చైనా నుంచి టాయ్స్..**

లెర్నింగ్ రిసోర్సెస్ లిమిటెడ్.. అమెరికాలో ఇల్లినోయీ కేంద్రంగా వ్యాపారం చేస్తోన్న ఒక బొమ్మల కంపెనీ. తన దిగుమతుల్లో మెజార్టీ వాటా చైనాదే. అక్కడి నుంచి ఎడ్యుకేషన్ టాయ్స్‌ను కొనుగోలు చేస్తోంది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి మిత్ర దేశం, శత్రు దేశం అనే తేడా లేకుండా భారీస్థాయిలో సుంకాలు విధించారు. దాంతో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటున్న కంపెనీలకు ఆ విధానాలు శరాఘాతమయ్యాయి.

అలాంటి అయోమయ పరిస్థితుల్లో అధ్యక్షుడి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. లెర్నింగ్ రిసోర్సెస్ యజమాని రిక్ వోల్డెన్‌బర్గ్ గత ఏప్రిల్‌లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మరికొందరు పిటిషనర్లతో కలిసి.. ఈ చిన్న సంస్థ విజయం సాధించేవరకు ఏమాత్రం వెనక్కితగ్గకుండా తన న్యాయపోరాటం కొనసాగించింది. ఇప్పుడు ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం చూపే కీలక తీర్పులో భాగమైంది.

**డబ్బులు తిరిగిచ్చేయండి..**

"ఇన్ని రోజుల ఉత్కంఠకు, ఇబ్బందికి ఈ తీర్పు ఊపిరినిచ్చింది. ఇక, ఈ ప్రభుత్వం నా దగ్గరి నుంచి తీసుకున్న దానికి రికార్డు ఉంది. నా డబ్బులు నాకు తిరిగిఇచ్చేయండి. నేను చేసింది రాజకీపరమైన పోరాటం కాదు. ఇది పన్నుల గురించి చేసింది. పన్నుల రూపంలో చెల్లించాల్సిన దానికంటే అమెరికన్లు అదనంగా కట్టారు. ఒక దేశం తన ఆదాయాన్ని పెంచుకోవాలంటే.. దానిపై చట్టసభ సభ్యులు చర్చించుకోవాలి" అని తొలి పిటిషన్‌దారుల్లో ఒకరైన వోల్డెన్‌బర్గ్ వెల్లడించారు.

యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ 2025 నివేదిక ప్రకారం.. యూఎస్ దిగుమతిదారుల్లో 97శాతం మంది చిన్న వ్యాపారులే. వారు ఏటా సుమారు 868 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను అమెరికాకు తీసుకువస్తున్నారు. సుంకాలు వాటి మనుగడకు ముప్పు అని ఆ నివేదిక అప్పట్లో ఆందోళన వ్యక్తంచేసింది. కంపెనీలు తమ తయారీ కేంద్రాలను అమెరికాకు మార్చేందుకు ఈ టారిఫ్‌లు దోహదం చేస్తాయని ట్రంప్ ప్రభుత్వం వాదించింది. దీనిపై వోల్డెన్‌బర్గ్ స్పందిస్తూ.. వాస్తవాలను విస్మరించారని వ్యాఖ్యానించారు. "చైనాలో బొమ్మల తయారీ కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నిపుణులైన కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. అలాంటి వ్యవస్థను ఇక్కడ ఏర్పాటుచేయడానికి ఏళ్లు పట్టొచ్చు" అని వ్యాఖ్యానించారు.

ట్రంప్ ఆదేశాల మేరకు దిగుమతిదారుల నుంచి ఇప్పటివరకు అదనంగా వసూలుచేసిన సుంకాలను ఆయా కంపెనీలకు తిరిగి చెల్లించాలా, వద్దా అనే విషయాన్ని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేయలేదు. అసలు ఆ విషయాన్నే ప్రస్తావించలేదు. అదనపు సుంకాల వసూలును నిలిపివేసినా, వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించాల్సి వచ్చినా ట్రంప్ ప్రభుత్వ ఆదాయం అంచనాలు తలకిందులయ్యే అవకాశం ఉంది.

# ఇదే ఏడాది మరో టోర్నీలో భారత్ - పాక్ మ్యాచ్?




టీ20 ప్రపంచ కప్‌లో భారత్ - పాకిస్థాన్ మ్యాచ్ చూశాం. ఈ పోరులో టీమ్‌ఇండియా ఘన విజయం సాధించింది. వ్యూస్‌పరంగానూ రికార్డు నమోదు చేసింది. ఈ క్రమంలో ఇరు జట్లు మరో టోర్నమెంట్‌లోనూ తలపడతాయని వార్తలు వస్తున్నాయి. అయితే, బీసీసీఐ తీసుకోబోయే తుది నిర్ణయంపైనే ఇది ఆధారపడి ఉంటుంది. సెప్టెంబర్ 19 నుంచి ఆసియా గేమ్స్ మొదలవుతాయి. ఈసారి కూడా టీ20 ఫార్మాట్‌లోనే మ్యాచులు జరుగుతాయని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ టోర్నీలో ఆడే మ్యాచులకు ఐసీసీ గుర్తింపు కూడా ఉంది. ఇందులోనే భారత్ - పాకిస్థాన్ తలపడనున్నాయి.

**గతంలో ఏమైందంటే?**

తొలిసారి 2010 ఆసియా గేమ్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కింది. పురుషుల, మహిళల విభాగంలో మ్యాచులు జరిగాయి. అయితే, బీసీసీఐ ఈ గేమ్స్‌కు జట్లను పంపించలేదు. అప్పుడు బంగ్లాదేశ్ విజేతగా నిలిచి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. ఇక 2014లోనూ భారత టీమ్‌లు వెళ్లలేదు. 2018లో క్రికెట్‌కు అవకాశం ఇవ్వలేదు. మళ్లీ 2023లో క్రికెట్ మ్యాచ్‌లకు ఐసీసీ గుర్తింపు ఇవ్వడంతోపాటు టీ20 ఫార్మాట్‌లో జరిగింది. తొలిసారి భారత్ నుంచి పురుష, మహిళా జట్లు బరిలో దిగాయి. రెండు టీమ్‌లూ స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నాయి. రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలో భారత్ ఆడింది. మళ్లీ 2026లో ఆసియా గేమ్స్‌కు జపాన్ వేదికగా క్రికెట్ మ్యాచులు జరగనున్నాయి.

**ప్రస్తుత వరల్డ్ కప్‌లో..**

ఐసీసీ టోర్నీల్లో పాకిస్థాన్‌పై భారత్‌దే ఆధిపత్యం. ఇరు జట్ల మధ్య మ్యాచ్‌కు ప్రజాదరణ కూడా ఎక్కువే. ఇప్పటికే టీ20 ప్రపంచ కప్ 2026లో తలపడిన సంగతి తెలిసిందే. అయితే, ఇదే టోర్నీలో మరోసారి కూడా భారత్ - పాక్ పోటీ పడినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇలా జరగాలంటే మాత్రం ఇరు జట్లూ సెమీస్‌కు చేరుకోవాలి. ప్రస్తుతం సూపర్-8 దశలో టోర్నీ ఉంది. భారత్, పాకిస్థాన్ వేర్వేరు గ్రూపుల్లో ఉన్న సంగతి తెలిసిందే. గ్రూప్ -1లో భారత్ టాప్‌లో ఉండి.. గ్రూప్ -2లో పాకిస్థాన్ రెండో స్థానంలో ఉంటే సెమీస్‌లో ఇరు జట్ల మధ్య మ్యాచ్ వచ్చే అవకాశం ఉంది. వేర్వేరుగా వచ్చి ఫైనల్‌కు చేరుకుంటే.. ఆ మజానే వేరు.

# క్లాడ్ ఏఐ ట్వీట్‌తో కుదేలైన సైబర్ సెక్యూరిటీ స్టాక్స్

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావం ప్రపంచ మార్కెట్లపై రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో ఒకే ఒక్క ట్వీట్ సైబర్ సెక్యూరిటీ రంగాన్ని కుదిపేసింది**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావం ప్రపంచ మార్కెట్లపై రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో ఒకే ఒక్క ట్వీట్ సైబర్ సెక్యూరిటీ రంగాన్ని కుదిపేసింది. క్లాడ్ ఏఐ పేరిట సోషల్ మీడియాలో వచ్చిన సందేశం ప్రభావంతో ప్రముఖ సైబర్ సెక్యూరిటీ కంపెనీల మార్కెట్ విలువలో భారీ పతనం చోటుచేసుకుంది. అంచనా ప్రకారం కొన్ని గంటల్లోనే సుమారు 15 బిలియన్ డాలర్లకు పైగా మార్కెట్ క్యాపిటలైజేషన్ తగ్గిపోయింది. ఈ ట్వీట్ వెలువడిన వెంటనే ప్రముఖ కంపెనీల షేర్లు ఒక్కసారిగా క్షీణించాయి. క్రౌడ్ స్ట్రైక్ షేరు 7.95 శాతం పడిపోగా.. క్లౌడ్ ఫ్లేర్ 8.05 శాతం నష్టపోయింది. అలాగే జెడ్ స్కేలర్ 5.47 శాతం తగ్గగా.. పాలో అల్టో నెట్ వర్క్స్ 1.52 శాతం క్షీణించింది. ఈ పరిణామం పెట్టుబడిదారుల్లో ఆందోళనను రేకెత్తించింది.

-ట్వీట్ లో ఏముందంటే? ఆధునిక ఏఐ వ్యవస్థలు సైబర్ భద్రతా రంగంలో కీలక బాధ్యతలను స్వయంచాలకంగా నిర్వహించే స్థాయికి చేరుకుంటున్నాయని పేర్కొన్నట్లు తెలుస్తోంది. థ్రెట్ గుర్తింపు నుంచి తక్షణ స్పందన వరకు అనేక ప్రక్రియలను ఏఐ నిర్వహించగలదని.. దీనివల్ల సంప్రదాయ సైబర్ సెక్యూరిటీ సేవల అవసరం తగ్గవచ్చనే అభిప్రాయం వ్యక్తమైంది. ఇదే మార్కెట్‌లో భయాందోళనలకు దారితీసింది. ఈ నేపథ్యంలో సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉద్యోగాల భవిష్యత్తుపై కూడా చర్చ మొదలైంది. ఏఐ విస్తరణతో ఉద్యోగ అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని కొందరు భావిస్తున్నప్పటికీ.. నిపుణులు మాత్రం దీనిని పూర్తిస్థాయి ప్రత్యామ్నాయం కాదని.. మానవ నైపుణ్యం ఇంకా అవసరమేనని చెబుతున్నారు. ఏఐ సాంకేతికతను వినియోగించుకుని మరింత సమర్థవంతమైన భద్రతా వ్యవస్థలు ఏర్పడతాయని వారు అభిప్రాయపడుతున్నారు.

మార్కెట్ విశ్లేషకుల ప్రకారం.. ఈ పతనం తాత్కాలిక ప్రతిస్పందన కావచ్చని భావిస్తున్నారు. సైబర్ భద్రత అవసరం ఎప్పటికీ తగ్గదని, ఏఐ కూడా అదే రంగాన్ని బలోపేతం చేసే సాధనంగా మారుతుందని చెబుతున్నారు. ఇప్పటికే అనేక సైబర్ సెక్యూరిటీ సంస్థలు ఏఐ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నాయి. మొత్తానికి.. ఈ ఘటన ఒక విషయం స్పష్టం చేసింది.. ఏఐ ఇప్పుడు కేవలం సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా మార్కెట్ భావోద్వేగాలను ప్రభావితం చేసే శక్తిగా మారింది. ఒకే ట్వీట్‌తో బిలియన్ల డాలర్ల విలువ మారిపోవడం దీనికి నిదర్శనం. భవిష్యత్తులో ఏఐ , సైబర్ సెక్యూరిటీ మధ్య పోటీ కాకుండా పరస్పర సహకారం కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.



## డిగ్రీలు కాదు.. పరిజ్ఞానం ముఖ్యం: వెంకయ్యనాయుడు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతున్నారు. గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వాళ్లంతా ఓడిపోయారు. వ్యవస్థలో అలాంటి వ్యక్తులను ప్రోత్సహించకూడదు. సమాజం అలాంటి వాళ్లని బహిష్కరించాలి. రామాయణాన్ని పాఠ్య పుస్తకాల్లో పొందుపరచాలి. తల్లిదండ్రులు, పెద్దలు పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించాలి. గూగుల్‌కి ప్రాధాన్యం తగ్గించి.. బుర్రకి పని చెప్పాలి. మంచి సమాజ నిర్మాణానికి మనందరం కృషి చేయాలి" అని వెంకయ్యనాయుడు అన్నారు.

### చిలక్కి చెప్పినట్లు చెప్పినా వినలేదు

## రూ.49 లక్షలు మోసపోయిన వైనం

(మొదటి పేజీ తరువాయి)

కోల్‌కతాకు చెందినదని తేలింది. దీంతో లావాదేవీ నిలిపేసి, మోసాలపై అవగాహన కల్పించి పంపించారు.

అయినా వినలేదు: తర్వాత విశ్రాంత ఉద్యోగి మళ్లీ బ్యాంకుకు వచ్చి, తాము బెంగళూరుకు మారిపోతున్నామని చెప్పి.. ఎఫ్‌డీ క్లోజ్ చేసి, ఆ మొత్తాన్ని తన పొదుపు ఖాతాలోకి బదిలీ చేయించుకున్నారు. అనంతరం నగరంలోని ఇండియన్ బ్యాంకులో ఖాతా తెరిచారు. అక్కడి నుంచి మోసగాళ్ల ఖాతాకు రూ.49 లక్షలు బదిలీ చేశారు. ఆ సమయంలో బ్యాంకు సిబ్బంది ప్రశ్నించినా.. తెలిసిన వ్యక్తికే పంపిస్తున్నానని చెప్పారు. తీరిగ్గా నాలుగు రోజుల తర్వాత పోలీసులను ఆశ్రయించారు.

## ఆదాయానికి ఏపీ చిరునామాగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

పెంచే మార్గాలను నేర్పించి వారిని ఆదుకుంటున్నాం. కొత్త విషయాలు నేర్చుకునేందుకు ముందుంటా. ఆదాయానికి చిరునామాగా మన రాష్ట్రం ఉండాలి. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారనేది ప్రజలు గమనించాలి. దిల్లీలో జరిగిన ఏఐ సమిట్‌కు కాంగ్రెస్ వాళ్లు ఆటంకం కలిగించారు. నిన్న దిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తల వైఖరి చూసి చాలా బాధపడ్డా. దేశానికి ఎంతో మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలి" అని చంద్రబాబు అన్నారు.

## వారికి బంపర్ ఆఫర్ అంటున్న పవన్

(మొదటి పేజీ తరువాయి)

కీలక వ్యక్తులకు అప్పగించినా గతంలో ఉన్నంత ఊపు అయితే సైనికులలో కనిపించడం లేదని గుర్తించారు అధికారంలో ఉన్నపుడు ఒకింత రిలాక్స్ అవడం సహజం. అయితే ఇది ఆ మాదిరి ఉదాశీనత కాదని అసంతృప్తి కూడా ఉందని పవన్ గ్రహించారు అని అంటున్నారు.

**వారే కావాలి అంటూ :** పార్టీ పెట్టినప్పటి నుంచి భుజం భుజం కలిపి ఎంతో శ్రమ చేసి అధికారంలోకి జనసేనను తీసుకుని వచ్చేందుకు అహరహం శ్రమించిన జనసైనికులలో చాలా మంది మౌనంగా ఉంటున్నారు. వారికి పదవులు దక్కలేదు, అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవులు వస్తాయని వారు భావించారు. అయితే కూటమి ధర్మంతో పాటు పార్టీల బలాబలాలు ఆధారంగా నిష్పత్తి మేరకు జనసేనకు దక్కాల్సిన వాటా దక్కింది. అయితే ఆశావహులు అధికంగా ఉండడంతో అనుకున్న వారికి పెద్దగా అవకాశాలు రాలేదు, దాంతో వారు కొంత నిరుత్సాహ పడ్డారు అలా జనసేనలో చూస్తే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలు అంతా కొంత దిగాలుగా ఉన్నారని గ్రహించిన అధినాయకత్వం వారికి అధిక ప్రయారిటీ ఇవ్వాలని చూస్తోంది అని అంటున్నారు.

**కీలక అవకాశాలు :** జనసేన పరంగా వారికి తగిన గుర్తింపుని ఇవ్వాలని అలాగే పార్టీ పదవులలో కష్టించి పనిచేసే వారికి న్యాయం చేయాలని అధినాయకత్వం భావిస్తోంది అని అంటున్నారు. ప్రస్తుతం సభ్యత్వ కార్యక్రమాలకు తెర తీసిన అధినాయకత్వం ఎవరైతే ప్రజలతో మమేకం అవుతూ జనసేనను మరింతగా బలోపేతం చేసి సభ్యత్వ నమోదుతో చెప్పిన మేరకు లక్ష్యాన్ని సాధిస్తారో వారికి పదవులు ఇవ్వాలని గౌరవించాలని కూడా అధినాయకత్వం భావిస్తోంది అని అంటున్నారు. ఆ విధంగా పార్టీ పదవులలో న్యాయం చేయడం ద్వారా మునుపటి మాదిరిగా వారిలో చురుకుదనం పుట్టించడమే కాకుండా పార్టీ రేపటి రోజు కోసం వారిని మరింత ఉత్సాహంగా మార్చాలని చూస్తున్నారు.

**స్థానిక పోరు మీద :** అంతే కాదు ఈ ఏడాదిలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తన వాటా తాను సీట్లను తీసుకుంటుంది. అందులో కూడా పార్టీ కోసం పనిచేసిన వారిని ఎంపిక చేసి వారినే బరిలో నిలబెట్టాలని చూస్తోంది. ఆ విధంగా ఇటు పార్టీలోనూ అటు స్థానికంగా అధికార పదవులలోనూ కష్టించి పనిచేసే వారికే ప్రథమ తాంబూలం అన్నది జనసేన పెద్దలు స్పష్టంగా సందేశం ఇస్తున్నారు. దీంతో జనసేనలో ఇపుడు నూతన ఉత్సాహం వెల్లి విరుస్తోంది. జనసేన తరఫున పనిచేయడానికి కూడా క్యాడర్ లీడర్ మళ్ళీ కదం తొక్కుతున్నారు. తాజాగా పార్టీ సీనియర్ నేతలు క్యాడర్ తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మరీ పార్టీ గురించి వారిని వివరించడమే కాకుండా వారికి అధినాయకత్వం ఏ విధంగా గుర్తింపు ఇస్తుందో వివరించారు. మొత్తానికి చూస్తే మార్చి 14న జరుపుకునే జనసేన ఆవిర్భావ సభ నాటికి జనసేన మళ్ళీ కదం తొక్కుతుందని అంటున్నారు. ఆ మీదట ఇదే స్ఫూర్తిగా స్థానిక ఎన్నికల్లో సైతం సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేటుని సాధించేలా పార్టీ టార్గెట్‌ని ఫిక్స్ చేసుకుంది.

## AI సమ్మిట్‌లో యువ కాంగ్రెస్ వ్యవహారం సిగ్గుచేటు: మాజీ సీఎం జగన్

**అమరావతి :** ఏఐ సమ్మిట్‌లో యువజన కాంగ్రెస్ నిరసన తెలపడంపై ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. ఏఐ సమ్మిట్‌లో యువజన కాంగ్రెస్ మనందరినీ సిగ్గుపడేలా చేసిందని పేర్కొన్నారు. మన రాజకీయాలు ఎటువైపు వెళుతున్నాయని ప్రశ్నించారు. ఎవరూ మన దేశాన్ని కించపర్చకూడదని, రాజకీయ విభేదాలు ఎలా ఉన్నా, ఎల్లప్పుడూ ప్రపంచం ముందు ఐకమత్యం ప్రదర్శించాలని తెలిపారు. కాగా జగన్ ట్వీట్ కు టీడీపీ సోషల్ మీడియా కౌంటర్ ఇస్తోంది.మరి సొంతరాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై, వస్తున్న కంపెనీలపై ఎందుకు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ప్రశ్నిస్తోంది. జగన్ కు షర్మిల భయం పట్టుకుందని.. మోడీ అపాయింట్మెంట్ దొరకడం లేదని కామెంట్ చేస్తోంది. ఇదిలా ఉంటే ఏఐ సమ్మిట్ ఏఐ సమ్మిట్ లో యూత్ కాంగ్రెస్ ఆందోళన చేపట్టడం హాట్ టాపిక్ గా మారింది. ప్రపంచ దిగ్గజాలు వచ్చే సమ్మిట్ లో అలా ప్రవర్తించడం ఏంటని విమర్శలు వస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ నిరసనకు వ్యతిరేకంగా నేడు బీజేపీ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఆందోళనలు చేపడుతోంది.

**మంచిమాటలు**
- జాలి పడి ఇచ్చే పలకరింపులకి, ప్రేమకి జోలె పట్టకు
- భారం అనుకునే చోట భావాలు పంచుకోకు..!
- దూరం నెట్టేసే చోట దగ్గరవ్వాలని ప్రయత్నించకు..!
- నిజాయితీని గుర్తించని చోట నిమిషం కూడా వృథా చేయకు..!
- ఆత్మాభిమానాన్ని మించిన ధనం ఈ ప్రపంచంలో మరొకటి వుంటుందని భ్రమపడకు..!
- ఎదురుచూడని ఇంటికి పిలిచినా వెళ్ళకు..!
- నీది కాని దేని మీదా నిన్ను తినేసేంత ప్రేమ, అభిమానం ఏదీ పెంచుకోకు

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram,

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 128 విశాఖపట్నం, 22 ఫిబ్రవరి 2026 ఆదివారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00

# ఆదాయానికి ఏపీ చిరునామాగా ఉండాలి

**సీఎం చంద్రబాబు**



**వినుకొండ, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 20 :** గ్రామీణ ప్రాంతాల్లో మార్చి 31 నాటికి చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిదని సీఎం చంద్రబాబు అన్నారు. మండలానికి ఒక స్వచ్ఛరథం ఏర్పాటు చేస్తున్నామని, వారానికి ఒకసారి గ్రామానికి స్వచ్ఛరథం వస్తుందని చెప్పారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. స్వచ్ఛరథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను అందజేశారు. ప్రజావేదిక వద్ద స్టాళ్లను పరిశీలించారు.

"స్వచ్ఛ రథం వచ్చినప్పుడు పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు మీకు ఆదాయం వస్తుంది. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని 2025 జనవరిలో ప్రారంభించాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగుతున్నాయి. పచ్చదనం- పరిశుభ్రత, నీరు-మీరుతో ప్రజల వద్దకు వస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం. నేను సీఎంగా వచ్చేనాటికి 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. దానిని క్రమంగా తొలగిస్తున్నాం. వర్షాలు పడినప్పుడు భూ జలాలు కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడింది. కలుషిత నీళ్లు తాగితే డయేరియా వంటి అనేక సమస్యలు వస్తాయి. ప్రజలకు స్వచ్ఛమైన నీరు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టాం.

ప్రతి నెల మూడో శనివారం ఎక్కడ ఉన్నా కార్యక్రమానికి హాజరవుతున్నా. మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను వంద శాతం సేకరిస్తున్నారు. మార్చి 31 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోనూ చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిది. రాబోయే రోజుల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తుంది. ఇప్పటికే 'సూపర్ సిక్స్' హిట్ అయ్యింది. 'పేదల సేవలో' కార్యక్రమం కింద మొదటి తేదీనే ఇంటింటికి వస్తున్నాం. ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం కింద డబ్బులు ఇస్తున్నాం. ప్రతి ఎకరాకు నీళ్లిస్తున్నాం. గిట్టుబాటు వచ్చే పంటలు వేయిస్తున్నాం. రైతులకు టెక్నాలజీ అలవాటు చేస్తున్నాం. అగ్రికల్చర్ నిపుణులను అందుబాటులో ఉంచుతున్నాం. రైతాంగం టెక్నాలజీని అందిపుచ్చుకుంటోంది. మైక్రో ఇరిగేషన్, బిందుసేద్యం తదితర కార్యక్రమాలను నేనే ప్రారంభించా. వారసత్వంగా వచ్చే పంటలే పండిస్తే ఆదాయం లేకుండా ఇబ్బందులు వస్తున్నాయి. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో రూ.5కే భోజనం పెడుతున్నాం. మెరుగైన జీవన ప్రమాణాల కోసం పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. ఆదాయం

⏭ తరువాయి 2లో..

# అంతర్జాతీయ వేదికను రాజకీయ ప్రదర్శనగా మార్చడం బాధాకరం: లోకేశ్



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 20 :** దిల్లీ ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ వైఖరి చూసి దిగ్భ్రాంతి చెందినట్లు ఏపీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. "అంతర్జాతీయ వేదికను రాజకీయ ప్రదర్శనగా మార్చడం బాధాకరం. భారత్ ప్రతిష్ఠను ప్రపంచ దేశాల ముందు తగ్గించే చర్య ఇది. సాంకేతిక ప్రతిభ, ఆవిష్కరణలు ఆహ్వానించేందుకే ఇలాంటి గ్లోబల్ వేదికలు. ప్రస్తుతం ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంది. మన దేశ గౌరవాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత" అని లోకేశ్ పేర్కొన్నారు.

# వారికి బంపర్ ఆఫర్ అంటున్న పవన్

**జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన పార్టీని బలోపేతం చేయడం మీద ఫుల్ ఫోకస్**

**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 20 :** జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన పార్టీని బలోపేతం చేయడం మీద ఫుల్ ఫోకస్ పెడుతున్నారు. పార్టీలో ఏమి జరుగుతోంది, ఎవరేమిటి అన్నది ఆయన పక్కా సమాచారాన్ని తెప్పించుకుంటున్నారు కూటమితో జత కట్టి అధికరం అందుకుని ఇరవై నెలల సమయం గడచిపోయింది. పవన్ అయితే ఉప ముఖ్యమంత్రిగా అయిదు కీలక శాఖలతో బిజీగా ఉన్నారు. మరో వైపు చూస్తే పార్టీ బాధ్యతలను తాను చూస్తూనే

⏭ తరువాయి 2లో..



# భక్తుల ఆగ్రహాన్ని ఎదుర్కోలేకే నాటకాలు ఆడుతున్నారు

**మంత్రి మండిపల్లి**



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 20 :** శ్రీశైలం లడ్డూలోనూ కల్తీ నెయ్యి సరఫరా చేసి భక్తుల విశ్వాసాన్ని వైకాపా వొమ్ముచేసిందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. విజయ డెయిరీని కాదని రాజేష్ కార్పొరేషన్ ద్వారా కల్తీనెయ్యి సరఫరా చేయడం పాపమన్నారు. బ్రహ్మోత్సవాల్లో అలజడి సృష్టించేందుకు కుట్రలు పన్నిన వారిని వదిలిపెట్టేది లేదన్నారు. భక్తుల ఆగ్రహాన్ని ఎదుర్కోలేకే ఆ పార్టీ నేతలు నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. దేవాలయాల పవిత్రతను కాపాడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భక్తుల విశ్వాసంతో చెలగాటమాడిన వైకాపాకు ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు.

# వైకాపా అరాచకాలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం : మంత్రి దుర్గేశ్



**రాజమహేంద్రవరం, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 20 :** వైకాపా అరాచకాలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. చెప్పులు లేకుండా కాలినడకన కొండ ఎక్కే సంప్రదాయాన్ని మరిచి.. కాలికి చెప్పులు, బూట్లు వేసుకొని వేంకటేశ్వరస్వామి ఫొటోలను ప్లకార్డులుగా వాడతారా? అని మండిపడ్డారు. ఏపీ శాసనమండలిలో వైకాపా సభ్యుల ప్రవర్తనపై రాజమహేంద్రవరంలో ఎన్డీయే కూటమి నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేశ్ మాట్లాడుతూ.. హిందుత్వంపై వైకాపాకి ఏమాత్రం గౌరవం లేదన్నారు. లడ్డూలో వాడిన కల్తీ నెయ్యినే మీ ఇళ్లలో వాడతారా? అని ప్రశ్నించారు. కలియుగ దైవం వెంకన్న పవిత్రతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ ఆదేశాల మేరకే సభ్యులు ప్రవర్తించినట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

ఛార్జ్‌షీట్‌కి క్లీన్‌చిట్‌కు తేడా తెలియని పార్టీ వైకాపా అని తూర్పుగోదావరి జిల్లా తెదేపా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. "జగన్‌కు హైందవ సంస్కృతి, సనాతన ధర్మంపై నమ్మకం లేదు. వైకాపాలో ఉన్న హిందువులు జగన్‌ను ప్రశ్నించాలి. క్షమాపణ చెప్పిన తర్వాతే వైకాపా నేతలు రాష్ట్రంలో తిరగాలి" అని అన్నారు. అనపర్తి భాజపా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పులివెందుల ఎమ్మెల్యే దర్శకత్వంలో శుక్రవారం శాసనమండలిలో కలియుగ దైవాన్ని అవమానించారని అన్నారు. భారత చరిత్రలో తొలిసారిగా దేవుణ్ని చట్టసభల్లో అవమానించారని మండిపడ్డారు. సిట్ నివేదిక ఇవ్వకముందే లడ్డూ తయారీలో జంతు కొవ్వు ఉందని ఎన్‌డీడీబీ నివేదికలో తేలిందని చెప్పారు. జగన్ అసెంబ్లీకి రారు.. ప్రజాసమస్యలపై మాట్లాడరని విమర్శించారు. వైకాపా హయాంలో డ్రైవర్‌ను హత్య చేసి.. మృతదేహాన్ని ఎమ్మెల్సీ అనంతబాబు డోర్ డెలివరీ చేశారని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మండిపడ్డారు. జగన్ ఇదే విధంగా ప్రవర్తిస్తే వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు.

# తితిదే కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు



**తిరుమల, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 20 :** తిరుమల శ్రీవారిని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దర్శించుకున్నారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "మేము కూడా మా శాఖలో ఇలాంటి కేంద్రం ప్రారంభించాలని ప్రయత్నిస్తున్నాం. ఇలాంటి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కేంద్రాన్ని స్థాపించాలంటే కొన్నేళ్లు పడుతుంది. వైకుంఠం క్యూకాంప్లెక్సులో ఏఐ వినియోగం కోసం పనిచేసిన బృందంతో మేం కూడా చర్చిస్తాం. దేశంలో విమానయాన శాఖ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్యాసింజర్ల సమాచారం, ఆపరేషన్లను కమాండ్ కేంద్రం నుంచి నడిపిస్తే మంచి సౌకర్యాలు ఇవ్వొచ్చు. తితిదే కమాండ్ కేంద్రం మాకు ఆదర్శం" అని రామ్మోహన్ నాయుడు అన్నారు.

# డిగ్రీలు కాదు.. పరిజ్ఞానం ముఖ్యం: వెంకయ్యనాయుడు

**విజయవాడ, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 20 :** దేశాన్ని, మాతృ భాషని, చదువుకున్న విద్యా సంస్థని, గురువులని మరిచిపోకూడదని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "పరిశోధనకి యువత ప్రాధాన్యం ఇవ్వాలి. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. మన పూర్వీకులు మనకి అందించిన సంప్రదాయాలని భావితరాలకు అందించాలి. మన కట్టు, బొట్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి. తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి. భారత్ విశ్వగురువు అయినా.. వేరే దేశం మీద దండయాత్రలు చేయలేదు. కులం కన్నా.. గుణం మిన్న. భారత్ సత్తా ప్రపంచ వేదికల మీద చాటి చెబుతున్నారు. డిగ్రీలు కాదు పరిజ్ఞానం ముఖ్యం. ముఖ్యమంత్రి చంద్రబాబు టెక్నాలజీకి ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఏఐని అదుపుచేసి ముందుకువెళ్లాల్సిన అవసరం ఉంది. ఏఐ వస్తే మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోనన్న భయం నాకు ఉంది.



విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చెయ్యాలి. సోషల్ మీడియా తప్పుడు అంశాలకు వేదికైంది. భావితరాలను మంచి మార్గంలో నడపాలి. భవిష్యత్‌లో చాలా రంగాల్లో ఉద్యోగాలు పోతాయి. దీనికోసం మాట్లాడాల్సిన అవసరం ఉంది. దీనిపై చర్చించాలి. రాజకీయ నాయకులు బూతులు విపరీతంగా

⏭ తరువాయి 2లో..

# చిలక్కి చెప్పినట్లు చెప్పినా వినలేదు రూ.49 లక్షలు మోసపోయిన వైనం



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 20 :** డిజిటల్ అరెస్టు అనేది లేదని, ఆ పేరుతో వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని పోలీసులు ఆ విశ్రాంత ఉద్యోగికి చిలక్కి చెప్పినట్లు చెప్పారు. రూ.72.50 లక్షలు బదిలీ చేసేందుకు బ్యాంకుకు వచ్చిన అతణ్ని ఆపారు. ఎవరైనా ఇబ్బంది పెడితే.. తమను సంప్రదించాలని భరోసా ఇచ్చి మరీ పంపించారు. 15 రోజుల్లోనే మళ్లీ అలాంటి కాల్ రావడంతో ఈసారి ఆ విశ్రాంత ఉద్యోగి భయపడి, మోసగాళ్లకు రూ.49 లక్షలు బదిలీ చేసేశారు. విజయవాడలో స్థిరపడిన స్టీల్ ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి (65)కి గత నెలాఖరులో ఈడీ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఓ కాల్ వచ్చింది. మీపై కేసులున్నాయని బెదిరించారు. యూనిఫాంలో ఉండి వీడియో కాల్ చేసిన ఓ వ్యక్తి తాను దర్యాప్తు అధికారినని, రూ.72.50 లక్షలు ఇస్తే కేసు మాఫీ చేస్తానని అన్నాడు. దీంతో విశ్రాంత ఉద్యోగి విజయవాడ రామచంద్రనగర్‌లోని ఎస్‌బీఐ బ్రాంచికి వెళ్లారు. తన పేరిట ఉన్న రూ.78 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను రద్దు చేసి, అందులో రూ.72.50 లక్షలను మరో ఖాతాకు బదిలీ చేయాలని కోరారు. అనుమానం వచ్చిన బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఆ ఖాతా నంబరు పరిశీలిస్తే అది

⏭ తరువాయి 2లో..

విశాఖ సమాచారమ్
ఆదివారం 22-2-2026

# యువత మానసిక సంఘర్షణల కథ.. యుఫోరియా

నేటి కాలంలో యువత ఎదుర్కొంటున్న మానసిక సంఘర్షణలు, సోషల్ మీడియా ప్రభావం, మారుతున్న జీవనశైలితో పాటు డిజిటల్ ట్రాప్ లేదా సాంకేతిక ఉచ్చు చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందిన చిత్రం 'యుఫోరియా'. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ ఈ సినిమాను ఒక సరికొత్త ప్రయోగంగా తెరకెక్కించారు. ఒక విభిన్నమైన టీనేజ్ డ్రామాగా ప్రచార చిత్రాల ద్వారా ఆసక్తి కలిగించిన చిత్రం.

ఈ సినిమా ఒక ప్రైవేట్ కళాశాలలో చదువుకునే నలుగురు భిన్న స్వభావాలు కలిగిన స్నేహితుల జీవితాల్లో ఎదురైన తుఫాను వంటి పరిణామాల సమాహారం ఈ కథ. వీరంతా ఉన్నత వర్గాలకు చెందిన వారు.. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి ఉంటారు. నిరంతరం పార్టీలు, విందులు, వినోదాలతో కాలం గడిపే ఈ బృందం ఒకరోజు ఊహించని చిక్కుల్లో పడుతుంది. ఒక రాత్రి జరిగిన వేడుకలో ఒక అమ్మాయి అపస్మారక స్థితిలోకి వెళ్లడం, ఆ సంఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట్లో వైరల్ కావడంతో కథ మలుపు తిరుగు తుంది. ఆ ఆపద నుండి వారు ఎలా బయటపడ్డారు, ఆ క్రమంలో వారు నేర్చుకున్న పాఠాలు ఏమిటి అనేదే ఈ సినిమా ప్రధానాంశం.

**దర్శకుడి గత చిత్రాలకు భిన్నంగా..**

దర్శకుడు గుణశేఖర్ ఎంచుకున్న పాయింట్ చాలా సమకాలీనమైనది అయినప్పటికీ హిందీ, ఇంగ్లిష్ వెబ్ సిరిస్‌లు చూసే వారికి కొత్తదనం అనిపించక పోవచ్చు.. ఆయన, గత చిత్రాల భారీతనానికి భిన్నంగా, నేటి తరం ఆలోచనలను ప్రతిబింబించే రీతిలో సరికొత్త పంథాను అనుసరిస్తూ నేటి సమాజంలో సెల్‌ఫోన్ వాడకం హద్దులు దాటితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో.. ఈ చిత్రం ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు. సినిమా ప్రారంభం చాలా వేగంగా ఉంటుంది. పాత్రల పరిచయం, వారి ప్రవర్తన తీరును చూపిస్తూ కథలోకి మనల్ని వెంటనే తీసుకెళ్తారు.. అయితే ప్రథమార్ధంలో కొన్ని సన్నివేశాలు సాగదీసినట్లు అనిపిస్తాయి. ముఖ్యంగా యువతను ఆకర్షించే క్రమంలో కొన్ని బోల్డ్ సంభాషణలు, సన్నివేశాలు పరిధి దాటినట్లు కనిపిస్తాయి.

**సాంకేతిక విభాగాల పనితీరు బలం!**

ఈ సినిమాకు సాంకేతిక విభాగాల పనితీరు పెద్ద బలం. ప్రతి ఫ్రేమ్‌ను ఒక విజువల్ పోయెట్రీలా తీర్చి దిద్దిన ప్రవీణ్ కె.పోతన్ కెమెరా పనితనం అమోఘం. నియోన్ లైటింగ్ వాడకం, క్లోజప్ షాట్స్ ద్వారా పాత్రల మానసిక స్థితిని ప్రతిబింబించిన తీరు ఆయన పనితనానికి నిదర్శనం. కాలభైరవ అందించిన నేపథ్య సంగీతం కథలోని తీవ్రతను పెంచడంలో కీలక పాత్ర పోషించింది. ఎడిటింగ్ విభాగంలో ప్రవీణ్ పూడి తన అనుభవాన్ని చూపించారు. ద్వితీయార్ధంలోని కొన్ని సాగదీత సన్నివేశాలను తొలగించి ఉంటే కథనంలో వేగం మరింత పెరిగేది.

**సందేశం ఇవ్వాలనుకున్నప్పటికీ..**

సినిమాలోని సంభాషణలు సూటిగా, నేటి యువత మాట్లాడుకునే భాషలోనే ఉన్నాయి.. ప్రతి చిన్న విషయాన్ని లోతుగా చూపించడం, మానసిక విశ్లేషణ చేయడం ఆకట్టుకుంటుంది. సమాజానికి ఒక మంచి సందేశం ఇవ్వాలనే ఉద్దేశం బాగున్నా, దానిని చెప్పే క్రమంలో ఎంచుకున్న మార్గం కొందరికి నచ్చకపోవచ్చు. సినిమా క్లైమాక్స్ ఊహించని విధంగా ఉండి ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. తప్పు చేసినప్పుడు పారిపోవడం పరిష్కారం కాదని, దానిని ధైర్యంగా ఎదుర్కోవాలని చెప్పిన తీరు బాగుంది. అయితే కథా గమనంలో తర్కానికి అందని కొన్ని సన్నివేశాలు అప్పుడప్పుడు కనిపిస్తాయి. అంత పెద్ద సంఘటన జరిగినప్పుడు తల్లిదండ్రుల స్పందన ఇంకాస్త బలంగా ఉండాల్సిందేమో అనిపిస్తుంది. సినిమాను కేవలం యువత అభిరుచులకు అనుగుణంగా మలచడం వల్ల, ఇతర వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు తక్కువయ్యాయి. అలాగే కథలో ప్రధాన సంఘర్షణ ఆలస్యంగా మొదలవ్వడం వల్ల ప్రేక్షకులు కొంత అసహనానికి గురయ్యేలా ఉంది. కొన్ని చోట్ల డ్రామా అతిగా అనిపించి సహజత్వాన్ని దెబ్బతీసింది.

**యువతకు హెచ్చరిక..**

'యుఫోరియా' కేవలం ఒక టీనేజ్ డ్రామా మాత్రమే కాదు, డిజిటల్ యుగంలో యువత అడుగులు ఎటువైపు పడుతున్నాయో చూపే ఒక హెచ్చరిక. యువత తప్పుదోవ పట్టకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ చిత్రం గుర్తు చేస్తుంది. గ్లామర్, క్రైమ్, ఎమోషన్స్ కలగలిపిన ఈ సినిమా యూత్‌కు బాగా కనెక్ట్ అవుతుంది. మంచి సాంకేతిక విలువలు, నటీనటుల ప్రతిభ ఈ చిత్రాన్ని ఒకసారి చూడదగ్గదిగా మార్చాయి.. కథా బలంతో పాటు బలమైన సందేశం ఉండటం వల్ల సినిమా చూసి బయటకు వచ్చేటప్పుడు ప్రతి ఒక్కరూ తమ బాధ్యత గురించి ఆలోచించేలా దర్శకుడు ఈ చిత్రాన్ని మలిచారు. వైవిధ్యమైన సినిమాలను ఇష్టపడే వారికి 'యుఫోరియా' ఒక కొత్త అనుభూతిని మిగులుస్తుంది.

# యువత కలల సాకారానికి కష్టపడాలి

నేటి యువత తమ భవిష్యత్తు, వృత్తి (కెరీర్) పరమైన ఆలోచనలు, ఆరోగ్య విషయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలలు కనడం ఆహ్వానించదగ్గ పరిణామంగా భావించాలి. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లు యువత ఆశయాల సాధన కోసం కలలు కనడం ఆనందించే విషయమేగాని, వాటిని సాకారం చేసుకోవడానికి తగిన కృషి చేయకపోవడమే అభ్యంతరం.కలలు కన్నం త తేలికగా పనులు అయిపోవాలని అనుకోవడంతో వస్తోంది అసలు చిక్కంతా. ఆశించిన గోల్ చేరాలంటే అడ్డదారులు వెతుక్కోవడంతో కూడా సమస్య వస్తోంది. అనుకున్నది జరగకపోతే ఒక్కసారి నిరాశ,నిస్పృహ తర్వాత డిప్రెషన్ లోనవుతున్నారు.ఇటీవల కాలంలో చాలా మంది డిప్రెషన్ పేరుతో అనారోగ్యం పాలవుతున్నారు.వీటికి తోడు మత్తుపదార్థాలు,మద్యపానం లో మునిగి జీవితాలను పాడుచేసుకుంటున్నారు. తల్లిదండ్రులకు వేదన మిగులుస్తున్నారు.పోలీస్ క్రిమినల్ చార్టులలో పేరెక్కడంతో కెరీర్, భవిష్యత్తు నాశనం జరుగుతోంది. కొందరు తెలిసీ,తెలియక చేస్తున్న తప్పులకు తోటివారి జీవితాలనే కాక తమ జీవితాలను కూడా నాశనం చేసుకుంటున్నారు. చెడుసావాసాలతో, ప్రేమల విషయంలో క్షణికావేశంలో తప్పుల మీద తప్పులు చేసి, నేరచరితులై చదువులు,మంచి (విదేశీ) ఉద్యోగాలు, మంచి భవిష్యత్తు, పోగొట్టుకొని జైళ్లలో జీవితఖైదీలవుతున్నారు. జైళ్ల శాఖ లెక్కల ప్రకారం

ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే నేరచరిత్ర కలవారు 2025 లో 19,413 మంది ఉంటే 18–30ఏళ్ళ వయసు వారు 48 శాతం అనగా 9,318 మంది ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

వీరిలో నేరచరిత్ర కారణంగా విదేశీ, ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాలు పోగొట్టుకున్నవారు,ప్రేమ పేరుతో ప్రాణాలు పోగొట్టుకున్నవారు, క్షణికావేశంలో తోటివారి ప్రాణాలు తీసినవారు,మానభంగాలు హత్యలు చేసినవారు కూడా ఉన్నారు. కొందరు మానసిక కుంగుబాటుతో తాగుడుకు బానిసలై వాళ్ల భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్న వారూ ఉన్నారు.

భారతదేశంలో యువత మొత్తం జనాభాలో 27శాతం. ప్రపంచంలో, ప్రస్తుతం అత్యధికంగా యువత కలిగిన దేశం భారత దేశమే. స్వామి వివేకానంద భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే వుందని బలంగా నమ్మేవాడు. అందుకే వివేకానందుడు యువతను తన ప్రసంగాలతో, పుస్తకాలతో, ఉత్తేజపరిచి, దిశా నిర్దేశం చేసి స్ఫూర్తిని నింపేవాడు. ఆయన గొప్పతనాన్ని స్మరించుకుంటూ వివేకానంద జయంతి జనవరి 12వ తేదీన జాతీయ పండుగగా, యువజనోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ నాటి యువత ప్రవర్తనాతీరు,సౌశీల్యంతో, దూరదృష్టి తో ,లక్ష్యాన్ని నిర్దేశించుకుని,దానిని చేరటానికి ఎంతైనా కష్టపడి గమ్యం సాధించడానికి అడుగులు వేస్తున్నారని భావించవచ్చు.

డెభై ఏళ్ల క్రితం వరకు చాలా యువకులకు, సరిగా చెప్పేవారు, తెలిసిన వారు లేనందువలన, దిశానిర్దేశం లేక, విద్య, ఉపాధి అవకాశాలు లేక, ఏదో ఒకటి ఉన్నంతలో తోచింది చేసేవారు. చాలీ చాలని సంపాదన తో కాలం వెళ్లబుచ్చేవారు. అప్పుడు ఆ రోజుల్లో అధిక సంతానం వలన వారి పోషణ భారం తల్లిదండ్రులకు కష్టంగా ఉండేది. ఆడ పిల్లలను చదివించేవారు కాదు.ఇక మగ పిల్లలకి కూడా అత్తెసరు చదువులే. డబ్బు వున్న వాడు, మార్కులు రాక పోయినా సీట్లు కొనుక్కొని చదివేవాడు.కట్నాలు గుంజి డబ్బు రాబట్టుకుని పెళ్లి చేసుకునేవాడు. ఇక ఆడపిల్లలకు తెలిసీ తెలియని వయసు లోనే పెళ్లిళ్లు జరిగి, ఆర్థిక స్వతంత్రం లేక, ఇష్టం లేకున్నా,కష్టమైనా జీవితం కొనసాగించాల్సి వచ్చేది. అతికష్టమైతే బలవన్మరణానికి పాల్పడాల్సొచ్చేది.

ఇప్పటి యువత ప్రతి విషయంలో ఆలోచించుకుని ఆచితూచి అడుగులు వేయాల్సి ఉంది.ప్రభుత్వ చట్టాలను గౌరవించాలి. సోషల్ మీడియా ప్రభావంతో తమ కెరీర్ ను పాడుచేసుకునే చర్యలకు పాల్పడరాదు.

ప్రేమ పేరుతో జీవితం నాశనం చేసుకోరాదు. ప్రేమ జీవితంలో ఒక భాగం మాత్రమే నని గ్రహించాలి.ప్రేమ త్యాగం కోరుతుందని తెలుసుకోవాలి.భగ్న ప్రేమికులు విద్వేషానికి లోనయి సహచరులపై దాడికి పాల్పడడం అనైతిక,చట్టవ్యతిరేక చర్య.యువత కెరీర్, భవిష్యత్తుపై దృష్టి పెట్టుకుని ముందుకు సాగాలి.రిలేషన్ షిప్, బ్రేకప్ లని తాత్కాలిక ఆకర్షణలకు లొంగితే జీవితం రాచపుండులా మారుతుంది. భారతీయ వివాహవ్యవస్థ పురాతనమైనది.భారతీయ సమాజానికి పట్టుకొమ్మ.దానిని గౌరవించాలి. జపాన్, దక్షిణ కొరియా లాంటి దేశాల్లో కొంతమంది సంతానం భారమని వివాహాలకు విముఖత చూపించడం వలన జనాభా తగ్గి వృద్ధులు మిగిలి, దేశ పురోభివృద్ధి కి అంతరాయం ఏర్పడుతోంది.

యువతీయువకులు ముందుగా ఆర్థికస్వాతంత్రం సాధించాలి.పిల్లలను కనడంలో వివక్ష ఉండరాదు. ఆడమగ అనే వివక్ష సమాజానికి చీడ లాంటిది.పిల్లలను పెంచడం తల్లిదండ్రుల సామాజిక బాధ్యత. వారు లేకుంటే మనం ఉండే వాళ్లం కాదు కదా!

కనుక యువత, తాము మంచి నడతతో ఆర్థికంగా పరిపుష్టి సాధించి,సంఘటితమై, దేశ ప్రగతికి, స్వావలంబనకు, తమ వంతు సాయపడుతూ, ముందు తరాలకు మార్గదర్శకం కావాలి. అప్పుడే భారతీయతకు శ్రీరామ రక్ష.

**బూర్గుల రామకృష్ణ సాయి**

# అహింసా విప్లవంతో సత్యాగ్రహ పోరాటమే గాంధీ సిద్ధాంతం

అహింస అనే విప్లవ పంథాతో సత్యాగ్రహ పోరాటబాట పడితే విజయం తథ్యమని సిద్ధాంతీకరించారు గాంధీ మహాత్ముడు. ఎంతటి శత్రువు ఎదురైనా,శారీరక హింస,మరణం తప్పదనితెలిసినా ఓర్పు,సహనం, చిరునవ్వుతోచేసే, క్షమతోకూడిన పోరాటమే సత్యాగ్రహం. ఆయన సమాజం మొత్తంగా మార్చాలన్న సిసలైన విప్లవవాది.ఆ మార్పు అహింసా యుతంగా ఉండాలని ప్రతిపాదించిన సిద్ధాంతకర్త గాంధీ.అహింస జీవన విధానంగా మార్చుకుంటే భవిష్యత్ మహిళ చేతుల్లోనే నన్న గాంధీ.నైతికబలంలో స్త్రీ లకే అధికమని,ఈ అహింసా సమరంలో మహిళలే నాయకత్వానికి అర్హులన్నారు.

గాంధీ గురించి విశ్లేషిస్తే అమ్మలా లాలింపు అడుగడుగునా కనిపిస్తుంది.గాంధీ వ్యక్తిత్వం పరికిస్తే వేరువేరుకోణాల్లో బుద్ధుడు,ఏసుక్రీస్తు,వివేకానందుడు కనిపిస్తారు.భోధనల్లో కొంత సారూప్యత కనిపిస్తుంది. దిగ్గజ సంపాదకుడు "నార్ల" మాటల్లో అహింస ను వ్యక్తుల ద్వారా బుద్ధుడు, ఏసుక్రీస్తు సిద్ధాంతంగా ప్రయోగిస్తే,సంఘం ద్వారా గాంధీ ప్రయోగించడమే గొప్ప దార్శనికత.ఒక్క మాటలో చెప్పాలంటే గాంధీ సార్వత్రికంగా,సహజంగా,సర్వతోముఖంగా కనిపిస్తారు. గత ఐదువేల సంవత్సరాలలో ఇలాంటి మహోన్నతవ్యక్తిలేరు అంటే అతిశయోక్తికాదు.

"అసలైనవిప్లవవాది,సిసలైన సిద్ధాంతం కర్త గాంధీజీ" పుస్తకం వ్రాసింది ఆకాశవాణి పూర్వ డైరెక్టర్,సాహిత్యం, సైన్స్, సామాజిక విశ్లేషకులు నాగసూరి వేణుగోపాల్.గాంధీ ఆలోచనలు,వ్యక్తిత్వం,ఉద్యమసారథిగా అవతరించడం,విలక్షణ నేతలను,దేశప్రజలను స్వాతంత్ర్య పోరాటం వైపు నడిపించిన విజయసారథి గాంధీజీని అనేక కోణాల్లోపరిశోధించి పాఠకులకు పరిచయం చేసిన రచయిత కృషి అభినందనీయం.

గాంధీ మానసికంగా, శారీరకంగా బలశాలి.రోజుకు18 నుంచి 22 కిలో మీటర్లు నడిచేవారు.ఒకోసారి 40 కీ.మీకూడా నడిచేవారు.చిన్న చిన్న ఆరోగ్యం సమస్యలు మినహా చివరివరకూ ప్రజల్లో ఉన్నారు.దేశం మొత్తం స్వాతంత్ర్య సంబరాల్లో ఉండగా గాంధీ మాత్రం నౌఖాలీ లో గాయపడిన వారిని పరామర్శించడానికి వెళ్లడం ఆయన ప్రత్యేకత.చివరివరకూ రోజుకు 18 గంటలు పని చేయడం ఆయన ధృడత్వాని దర్పణం. గాంధీ ఒకదశలో మెడికల్ డిగ్రీ సాధించి వైద్యుడిగా స్థిరపడాలని భావించారు.ఆయన కుటుంబం బారిస్టర్ చదవాలని ఒప్పించారు. దక్షిణాఫ్రికాలో మరోప్రయత్నాన్ని అక్కడ ఆయన చేపట్టిన వివక్ష నిర్మూలనా ఉద్యమం ఆటంకమయింది.ఆయుర్వేదంలో పరిశోధనలు పెరగాలని,వైద్యులు మెరుగుపడాల్సి ఉందని నిర్మొహమాటంగా చెప్పారు. గాంధీ ఒక విషయంపై ఆసక్తి చూపితే దాన్ని లోతుగా అధ్యయనం చేసేవారు.ఏదైనా విషయం మీద ఎక్కువ అభిప్రాయాలుంటే తాజా అభిప్రాయమే సవరించిన అభిప్రాయంగా పరిగణించమంటారు గాంధీజీ.నగరాలు నిరంతర అహంకారంగా ఉంటాయని ఆయన వ్యాఖ్యల వెనుక వర్తమానకాలపు వనరులు దోపిడీ వంటి దుర్గుణాలు లను ప్రస్తావించడం గమనార్హం. భార్య కస్తూర్బా అన్నింటా తోడునీడగా ఉండడం కూడా ఆయన విజయ రహస్యం. 1900లో కస్తూర్బా సుఖప్రసవానికి వైద్య పుస్తకాలు చదివి మంత్రసానిగా మారారు. దేవదాస్ గాంధీ పుట్టుక సమయంలో ఆయన స్త్రీ హృదయం వెల్లడయింది.ఆంగ్ల భాషలోనే మనకు బానిస ధోరణి అలవడిందని అంటారు.మాతృభాష లోనే సైన్స్ భోధన జరగాలన్నారు.ఇంగ్లండ్లో చదివి, దక్షిణాఫ్రికా లో ఉన్నప్పుడూ తన ఆత్మకథ గుజరాతీ లోనే రాసారు.మానవుడి శరీరమే అతి సంకీర్ణమైన యంత్రమని తెలిసి యంత్రాలకు వ్యతిరేకిని ఎలా అవుతానని ఆయన అనడం గమనార్హం.కాని యంత్రాలవ్యామోహానికి వ్యతిరేకినన్నారు.వ్యవస్థలు,దేశం గూర్చి మాట్లాడుతూ లక్ష్యం కేంద్రీకృతమై ఉండాలి.అమలు వికేంద్రీకరించాలన్నారు.గ్రామ స్వరాజ్య భావన అందులోంచి వచ్చింది.రాజకీయాలు,నాయకులు గురించి మాట్లాడుతూ కమ్యూనిస్టు లందరూ చెడ్డవారు కారు,కాంగ్రెస్ వారందరూదేవతలు కాదన్నారు.కమ్యూనిస్ట్ సిద్ధాంతాలను మాత్రం ఆమోదించలేనన్నారు. ఈ భావాలు సమ్మేళనం పరిశీలిస్తే గాంధీ అత్యంత ఆధునికుడిగా అవగతమవుతాడు. కళ్లజోడు,చేతికర్ర,చెప్పులజత,మొలగడియారం, కొల్లాయి,పుస్తకం కాదు గాంధీ అంటే.అది ఆయన ఆహార్యం.గాంధీ అంటే సహజంగా జీవించడం, సమన్వయంతో సాగిపోవడం,తలవంచకుండా నిలబడడం,సాటి మనిషి సమస్య తన సమస్యగా స్వీకరించడం, వివాదం వస్తే ఎదుటివారి వాదన సహనంతో వినడం, సత్యాగ్రహం అనే విజయ ఆయుధం ఇవ్వడం వంటివి. తన జీవితాన్నే కాదు,మొత్తం సమాజాన్నే ప్రయోగశాలగా చేసి జీవించిన మహామనిషి.అందుకే మహాత్ముడు అయ్యాడు.మహా కవి శ్రీశ్రీ మాటల్లో "గాంధీ ఒక సామాన్య వ్యక్తి,అసామాన్య వ్యక్తి,తృణం కన్నా తేలిక,మేరువు కన్నా ధీరుడు" అనడం విశేషం.విజయానికి ఆయుధాలకన్నా అహింసాపోరాటానికి 11 రేట్లు అవకాశాలు ఎక్కువ అన్నారు గాంధీజీ.సెవెన్ సిన్స్ ప్రమాదకరమైనవి,అవాంఛనీయమైనవని ఏడు సూత్రాలను ప్రతిపాదించారు.వాటిని మన జీవితంలో పరిహరిస్తే సంఘంతో పాటు ప్రపంచ నడత మారుతుందని సూత్రీకరించారు బాపూజీ.

1915లో గాంధీ దక్షిణాఫ్రికా నుంచి భారత్ వచ్చేటప్పటికి అనిబిసెంట్ హోం రూల్ ఉద్యమం నడుస్తున్నది. అహమ్మదాబాద్ లో సత్యాగ్రహ ఆశ్రమం ప్రారంభించారు.గోపాలకృష్ణగోఖలే సలహా మేరకు సంవత్సరంపాటు దేశంలో విస్తృతంగా పర్యటించారు.ప్రజావాణి,స్థితిగతులు,బ్రిటీష్ వారి దురంతాలు తెలుసుకున్నారు.1916లో గాంధీ తొలి ప్రసంగం బెనారెస్ విశ్వవిద్యాలయంలో చేసారు.కాంగ్రెస్ సమావేశాల్లో నెహ్రూతో పరిచయం అయింది.అతివాద,మితవాద నాయకులను సమన్వయపరిచి కాంగ్రెస్ ను ముందుకు నడిపించారు.1917లో చంపారణ్యంలో నీలిమందు రైతుల ఉద్యమంలో పాల్గొని తన విధానాన్ని దేశీయంగా పరిక్షించుకున్నారు. అహ్మదాబాద్ లో జౌలీకార్మికుల సమస్యా పరిష్కారానికి కృషి చేసారు.గుజరాత్ ఖేడా కరువురైతుల సమస్య సత్యాగ్రహం తో పరిష్కరించారు. కరువు,ఇన్ ఫ్లుయంజా మహమ్మారితో కోటి20 లక్షలమంది ప్రజలు అసువులుబాసారు.దేశ జనాభా 1911 కంటే 1921 సెన్సెస్ లో భారీగా తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి.1919లో రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా "శాసనోల్లంఘన" కు పిలుపునిచ్చారు.ఆ ఏడాదే "జలియన్ వాలాబాగ్" దురంతం జరిగింది.1921 మధురైలో కొల్లాయి కట్టి నేత కార్మికుల సమావేశంలో ప్రసంగించారు.1922 లో "చౌరీచోరా"లో ఉద్యమం అపసృతితో 22 మంది పోలీసులు మృతి చెందడంతో కలతచెందిన గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని అర్థాంతరంగా ఆపివేశారు.సత్యాగ్రహ ఉద్యమానికి మరింత శిక్షణ అవసరమని భావించారు.1928లో సైమన్ కమిషన్లో భారతీయులు లేకపోవడంతో "గోబ్యాక్" అని అలజడి పెద్ద ఎత్తున చెలరేగింది.1930లో ఉప్పు సత్యాగ్రహం,దండియాత్ర ప్రారంభించారు.ఆ తరువాత క్విట్ ఇండియా ఉద్యమం వరకూ గాంధీ కనపడరు.ఈ కాలంలో గాంధీ ఆలోచనల కేంద్రంగా సమాంతరంగా అనేకమంది ప్రముఖులు ఉద్యమానికి కృషి చేసారు.వికేంద్రీకరణకు గాంధీ ఉత్తరాల ద్వారా శ్రీకారం చుట్టారు.1942 లో జైలులో ఉన్నప్పుడే భార్య కస్తుర్బా,సహచరుడు మహదేవ్ దేశాయ్ లను కోల్పోయారు.హిందూ ముస్లింఐక్యత తొలినుంచి ప్రాధాన్యత ఇచ్చారు.చివరకు అదే ఆయన హత్యకు కారణమయ్యింది.దేశవిభజన అనంతరం చెలరేగిన నరమేధం గాంధీ హత్యతో తగ్గిందనేది వాస్తవం.గాంధీ రాజకీయ స్వాతంత్ర్యం తో పాటు గ్రామాలు,మహిళలు ,విద్య,వైద్యం,పరిశ్రమలు,పర్యావరణం మెరుగవ్వాలని సిద్ధాంతీకరించిన గాంధీజీ. నెహ్రూ,పటేల్,జిన్నా,నేతాజీ,రాజాజీ,ప్రకాశం వంటి విలక్షణమైన నేతలను ఏకతాటి మీద నడిపించిన ఘనత గాంధీజీది.40 కోట్ల జనాభా గల ఈదేశాన్ని అహింస బాటలో నడిపించారు.ఈ పోరాటంలో 4 కోట్లమంది స్త్రీ,పురుషులు,యువత,పిల్లలు పాల్గొనడం గాంధీశాంతి మంత్రంతోనే సాధ్యమైంది.

కుటుంబపరంగా ఆయన అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారు.పెద్దకుమారుడు హరిలాల్ గాంధీని మొదటినుంచి వ్యతిరేకించారు.1900 లో నాల్గోకుమారుడు దేవదాసు పుట్టాడు.రక్తహీనత,బ్రాంకైటిస్ తో ఇబ్బందిపడే కస్తూర్బా ప్రసవసమయంలో పడేయాతన గమనించాడు. గాంధీ 1906 నుంచి ఆమె సహకారంతో కఠోర దీక్ష గా బ్రహ్మచర్యం పాటించేవారు.ఆయన ధృఢ నిర్ణయానికి ఇది మచ్చుతునక. సత్యం,అహింసా,బ్రహ్మచర్యం ఆయన జీవిత మార్గాలు.మూడో అంశం మీద అనేకవిమర్శలు కూడా భరించారు.బ్రహ్మచర్యం మీద చేసిన ప్రయోగాలు వివాదాస్పదమయ్యాయి.కేవలం సెక్స్ లేకుండా ఉండేది బ్రహ్మచర్యంకాదన్నారు.కోపం,లోభం,గర్వం,భయం,ద్వేషం,అసూయ వంటి నెగెటివ్ ఎమోషన్స్ నియంత్రించుకోవడం కూడా బ్రహ్మచర్యమన్నారు గాంధీ. ప్రపంచంలో అన్ని భాషల్లో గాంధీ గురించి సాహిత్యం నిరంతరవాహినిగా ఉత్పన్నవవుతున్నది.ముఖ్యంగాపర్యావరణంపై గాంధీ ఆలోచనలపై విస్తృత చర్చ జరుగుతున్నది.పరిశుభ్రత, ప్రజారోగ్యానికి పెద్దపీట వేసారు. పట్టణాలు, నగరాల కాలుష్యం,అనారోగ్యం, ట్రాఫిక్ దృష్ట్యా గ్రామాభివృద్ధి మేలని పేర్కొన్నారు.నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో మనం ఈ అంశాన్ని ఆలో చేయించాల్సి ఉంది.కార్మిక,రైతు సంక్షేమం కోరుతూ తన ఉద్యమానికి శ్రీకారం చుట్టడం ఆయన ఆలోచనా ధోరణి తేటతెల్లమవుతోంది.ఏదిఏమైనా సంక్షుభిత ఆధునిక ప్రపంచానికీ గాంధీమార్గమే శరణ్యమని ప్రపంచ మేధావులు అంగీకరించడం ఆయన దార్శనికత కు వాస్తవ దృక్కోణం.

**యం.వి.రామారావు**

# భవిష్యత్తు నిర్మించేది బడులా.. గుడులా?

దేశంలో ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే గుడులు పెరుగుతున్నాయి బడులు పడావ్ పడుతున్నాయి, దేశంలో బడుల సంఖ్య కంటే గుడుల సంఖ్య అధికంగా ఉంది. ఇలా గుడులు మెరిసిపోతుంటే బడులు మూతపడుతున్నాయి. దేశంలో 6.4 లక్షల గుడులు ఉన్నాయి.. అలాగే మసీదులు మూడు లక్షల నుండి నాలుగు లక్షల వరకు దాదాపుగా ఉన్నాయి. ఇక చర్చిలను చూస్తే 28 వేలకు పైగా ఉంటాయి. ఇంకా గుర్తించనివి లెక్కిస్తే వీటి సంఖ్య ఇంకా పెరుగుతుంది, దీన్ని బట్టి దేశంలో గుడులు పెరుగుతున్నాయి బడులు పడావ్ పడుతున్నాయి. దేవాలయాలకు ఏ దేవుడు అడగకుండానే ఇలా విరాళాలు ఇస్తుంటారు తప్పులేదు.. కానీ అందులోని కొంత డబ్బును తమ చుట్టూ ఉన్న గ్రామాలలోని పాఠశాలలకు ఇస్తే ఆధునిక పాఠశాలలను నిర్మించవచ్చు.. కంప్యూటర్ లాబ్స్ ఏర్పాటు చేయవచ్చు, ఇలా చేయడం ద్వారా అక్కడ పిల్లలకు విద్యను అందించిన వారిమవుతాం. నలుగురికి జ్ఞానాన్ని అందించిన వారం అవుతాం. ఆ దేవుడే 'మానవసేవే మాధవసేవ' అని చెప్పాడు కదా.. అంతేగాని భక్తితో వ్యాపారం చేసేవారికి విరాళాల పేరుతో సాయం చేయకండి. భక్తి అనేది వ్యక్తిగత విషయం. దాన్ని మనం వ్యక్తిగతంగానే చూడాలి, ప్రజలకు ఉన్న నమ్మకాలు భక్తిని ఆసరా చేసుకొని వ్యాపారం చేసుకునే వస్తువు కాదు!! ప్రభుత్వాల తీరు ఇంకా విచిత్రం, ఎన్ని ప్రభుత్వాలు మారిన ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి మాత్రం జరగట్లేదు, బడుల అభివృద్ధి మాటేమో గానీ ఉన్న పాఠశాలలు రోజు రోజుకి మూతపడుతున్నాయి, అడ్మిషన్స్ తగ్గుతూ వస్తున్నాయి, శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, సరైన ఉపాధ్యాయులు లేకపోవడం, పెరుగుతున్న సాంకేతికతకు అను గుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు లేకపోవడం ఇందుకు కారణాలు.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపైన చిత్తశుద్ధి పాలకులకు లేకపోవటం, వారిలో కొందరికి ప్రైవేటు స్కూల్స్ కలిగి ఉండటం ద్వారా ప్రభుత్వ పాఠశాలలపైన దాని ప్రభావం ఉంటుంది. మన దేశం ఇతర దేశాలతో పోటీ పడాలంటే దేశ విద్యా వ్యవస్థలో మార్పులు రావాలి.. ప్రభుత్వంలోని అన్ని బడులలో నర్సరీ నుండి ఇంగ్లీష్




మీడియం ప్రవేశపెట్టాలి, ప్రస్తుత పరిస్థితులకు భవిష్యత్తుకు అనుగుణంగా పుస్తకాలలో మార్పులు తీసుకురావాలి, అప్పుడే విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన వారు అవుతారు, అప్పుడే దేశం అభివృద్ధిలో పురోగతిని సాధిస్తుంది.

–కె. వెంకటేష్,

# సింహాచలం భక్తులకు అందుబాటులోకి రాని సదుపాయాలు



లోవతోట ప్రాంతంలో క్యూ కాంప్లెక్సు భవనం నిర్మించే ప్రాంతం

**సింహాచలం, విశాఖసమాచారం:** సింహాచలం దేవస్థానంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సాగుతున్న 'ప్రసాద్' పథకం పనులు ఇంకా వివిధ దశల్లోనే కొనసాగుతున్నాయి. చందనోత్సవం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఆ పనులు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. గతేడాది ఏప్రిల్ 30న చందనోత్సవం రోజున గోడ కూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో కొన్ని నెలల పాటు పనులు నిలిచిపోయాయి. గుత్తేదారును బ్లాక్‌లిస్టులో పెట్టి.. కొత్త వారికి పనులు అప్పగించారు. ఏప్రిల్ 20న జరిగే చందనోత్సవం కంటే ముందే పూర్తయిన నిర్మాణాలను అప్పగించాలని దేవస్థానం అధికారులు ఇప్పటికే పర్యాటక శాఖను కోరారు.ఎన్టీఆర్ ఘాట్ సమీపంలో వ్యూపాయింటు నిర్మిస్తున్నారిక్కడ

రూ.5.40 కోట్లతో సింహగిరి రెండో ఘాట్రోడ్డు ప్రవేశం వద్ద 4 రూ.3.46 కోట్లతో చేపట్టిన పర్యాటక సమాచార భవనం, ఫుడ్‌కోర్టులు, సోలార్ విద్యుత్తు ప్లాంటు నిర్మాణాలపై దేవాదాయ శాఖ కమిషనర్ అభ్యంతరం చెప్పినా అప్పటి ఇంజినీరింగ్ అధికారులు పనులు కొనసాగించారు. సింహగిరి బస్టాండులోని ఈ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ఇప్పటి వరకు పూర్తయిన నిర్మాణాన్ని అప్పగించాలని దేవస్థానం కోరుతోంది..రూ.7.70 కోట్లతో చేపట్టిన వివిధ పనుల్లో కొన్ని ఇంకా ప్రారంభం కాలేదు. త్రిపురాంతక స్వామి ఆలయం దరి క్యూకాంప్లెక్సు నిర్మాణం పూర్తయింది. ఇది అప్పగిస్తే చందనోత్సవం రోజున భక్తుల క్యూలైన్లు ఇక్కడే ఏర్పాటు చేయాల్సి ఉంది.

ఎలివేటర్, పార్కింగ్ ప్రాంగణం ప్రారంభించ లేదు. ఆలయ ప్రాంగణంలో నిర్మించాల్సిన యాగశాల ఇంత వరకు ప్రారంభం



తొలిపావంచా వద్ద సగంలోనే నిలిచిపోయిన భవనం

ఎకరాల్లో నిర్మిస్తున్న బస్ కాంప్లెక్సు నిర్మాణం 80 శాతం పూర్తయింది. ఫుడ్ కోర్టులు, దుకాణాలు, టాయిలెట్ల నిర్మాణం పూర్తి కావొచ్చాయి. రూ.4.78 కోట్లతో కొండ దిగువన చేపట్టిన పుష్కరిణి సత్రం రెండు బ్లాకుల నిర్మాణం చివరి దశలో ఉంది.

రూ.3.80 కోట్లతో చేపట్టిన తొలిపావంచా, మెట్లమార్గం అభివృద్ధి పనులు సగంలోనే నిలిచిపోయాయి. రూ.11.20 కోట్లతో హిల్‌టాప్ రహదారి మార్గంలో నిర్మించిన యాత్రికులు వేచి ఉండేందుకు జీ ప్లస్ 1 భవనం పూర్తయింది. తుది మెరుగులు దిద్దాల్సి ఉంది. 500 మంది కూర్చునేలా నృసింహ మండపంలో నిర్మిస్తున్న యాంపీ థియేటర్ పనులు ఇంకా మిగిలి ఉన్నాయి. ఉత్తర గోపురం ఎదురుగా పాత కల్యాణోత్సవం ప్రాంగణంలోని వార్షిక కల్యాణం నిర్వహణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రూ. 5.60 కోట్లతో సింహగిరిపై చేపట్టిన దుకాణ సముదాయాల నిర్మాణం ఇప్పటికే పూర్తికాగా వ్యాపారులకు అప్పగించి వినియోగంలోకి తీసుకొచ్చారు. దక్షిణం వైపున దేవస్థానం ఆధ్వర్యంలో ఇంకా మెట్ల నిర్మాణం జరగాలి.

కాలేదు.

ఇవి కాకుండా రూ.3.75 కోట్లతో పాన్ ఏరియా అభివృద్ధి, ఆరు ఎలక్ట్రిక్ మినీ వ్యాన్లు, డిజిటల్ సూచిక బోర్డులు, బ్యాగేజీ స్క్రీనింగ్, సెక్యూరిటీ సిస్టం, మెటల్ డిటెక్టర్లు, తదితర సదుపాయాలు కల్పించాల్సి ఉంది.

ఇటీవల పర్యాటక శాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించిన ఈవో వెంకటరావు పూర్తయిన నిర్మాణాలను దేవస్థానానికి తక్షణమే అప్పగించాలని కోరారు.

పథకం...వివరాలు ఇలా...
కేంద్రం మంజూరు చేసింది: రూ. 54 కోట్లు
ప్రారంభం: 2023, డిసెంబర్
వర్చువల్ శంకుస్థాపన: 2024 మార్చి 7న ప్రధాని మోదీ
గడువు: 2024 డిసెంబర్
పొడిగింపు: 2025 మార్చి వరకు



సింహగిరిపై నృసింహ మండపం ఆవరణలో నిర్మాణ దశలో ఉన్న యాంపీ థియేటర్

# నిర్వహణ ఘోరం.. బకాయిల భారం

**అనకాపల్లి, విశాఖసమాచారం:** అచ్యుతాపురం, పల్లెల్లో వీధిదీపాల నిర్వహణ గాడి తప్పింది. దీపాలను ఆర్పాలనే ఆలోచనే పంచాయతీ సిబ్బంది మర్చిపోయారు. పగలూ, రాత్రి విద్యుత్తు దీపాలు వెలుగుతూ బిల్లులు తడిపిమోపెడు అవుతున్నాయి. వీటిని చెల్లించలేక పంచాయతీ అధికారులు చేతులెత్తేశారు. గతంలో సాయంత్రం వెలిగి ఉదయం 6 గంటలకే ఇవి వాటంతట అవే ఆరిపోయే వ్యవస్థ ఉండేది. ఇప్పుడు 24 గంటలూ వెలగడం వల్ల తక్కువ కాలానికే మూలకుచేరి పంచాయతీలకు అదనపు భారంగా మారాయి. జిల్లాలో 24 మండలాల్లో 646 పంచాయతీలు, రెండు మున్సిపాలిటీలు, ఒక జీవీఎంసీ ఉన్నాయి. విద్యుత్తు సరఫరా మెరుగు పరచడానికి పల్లెల్లో ప్రత్యేకమైన సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతోపాటు విద్యుత్తు ఆదా కోసం 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఎల్ఈడీ దీపాలు అమర్చింది. వీటి నిర్వహణ బాధ్యతను నెడ్‌క్యాప్‌నకు అప్పగించింది.

100 వాట్లతో ఉండే దీపాల స్థానంలో ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేయడంతో విద్యుత్తు ఆదా కావడంతోపాటు పంచాయతీలు చెల్లించాల్సిన బిల్లు సగానికిపైగా తగ్గిపోయింది. ఆదా అయిన మొత్తంలో 80 శాతం నెడ్‌క్యాప్, మిగిలిన 20 శాతం తిరిగి పంచాయతీలకు ఇచ్చేశారు. డ్యాష్ బోర్డు ద్వారా నిరంతరం పర్యవేక్షించారు. తరవాత అధికారంలోకి వచ్చిన జగన్ సర్కార్ 2019-24 కాలంలో నిర్వీర్యం చేసింది. ఇప్పుడు రాష్ట్రంలో కూటమి పాలన వచ్చినా అధికారుల తీరులో మార్పురాక వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. దీని వల్ల పంచాయతీల్లో విద్యుత్తు బకాయిలు రూ. 106.51 కోట్లకు చేరాయి.



బకాయిలు చెల్లించలేక, విద్యుత్తు వృథాను నివారించే వ్యవస్థలేక పంచాయతీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఏఐ సాంకేతికత ఉపయోగించి వృథా నివారించాలని కోరుతున్నారు.

వృథా నివారిస్తాం: పంచాయతీల పరిధిలో విద్యుత్తు బిల్లులు చెల్లించాలని ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీఓలకు ఆదేశాలు జారీచేశాం. పంచాయతీల్లో వృథాను నివారించడానికి చర్యలు తీసుకుంటాం. గత ఏడాది డిసెంబర్ నాటికి జిల్లాలో బకాయిలు రూ. 106.51 కోట్లు ఉన్నాయి. వీధి దీపాలు పగలు వెలగకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలి. దీనిపై ప్రత్యేకంగా సూచనలిస్తున్నాం.

# బ్లూ జెట్ ఫార్మా కంపెనీకి 28న శంకుస్థాపన

**రాంబిల్లి, విశాఖసమాచారం:** రాంబిల్లి, మండలంలోని ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) బ్లూ జెట్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భారీ ఔషధ తయారీ కంపెనీ ఏర్పాటుకు కేటాయించిన భూముల్లో భూమి చదును పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఏపీఐఐసీ అధికారులు సెజ్ కోసం రెండో విడత సేకరించిన రాంబిల్లి మండలం జడ్.చింతువ రెవెన్యూ పరిధిలోని సీతపాలెం వద్ద 102.48 ఎకరాలు కేటాయించారు. సుమారు రూ.2,300 కోట్ల పెట్టుబడితో నిర్మించే ఈ కంపెనీని మూడు దశల్లో నిర్మించనున్నారు మొదటి దశ 2027కు, రెండో దశ ఏప్రిల్ 2030కి, మూడో దశ అక్టోబరు 2031కి పూర్తి అవుతాయి. ఇప్పటికే ఇక్కడ ఉన్న సన్‌ఫ్రా కంపెనీ సమీపం నుంచి సీతపాలెం వరకు 1.4 కిలోమీటర్ల పొడవు, 100 అడుగుల



బ్లూ జెట్ ఔషధ కంపెనీ కోసం నిర్మిస్తున్న రహదారి

వెడల్పుతో రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ నెల 28వ తేదీన జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి నారా లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్టు కంపెనీ యాజమాన్యం తెలిపింది.

# రెవెన్యూ క్లినిక్‌లలో కానరాని చిత్తశుద్ధి



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** పేరుకుపోతున్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్ పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబరు 29న ఈ ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు.. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ఈ కార్యక్రమం చేపడుతున్నారు. మండల రెవెన్యూ అధికారులను అందరినీ ఒకచోట కూర్చోబెట్టి అక్కడికక్కడే భూ సంబంధిత అర్జీలకు పరిష్కారం చూపడటానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భూ సంబంధిత అర్జీలను స్వీకరించడానికి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ సెల్‌ను ఏర్పాటు చేశారు. నాలుగు కౌంటర్లలో ప్రత్యేక ఉప కలెక్టర్లు అన్ని రకాల భూసంబంధిత సమస్యలపై వినతులు స్వీకరిస్తున్నారు. ఒక్కో ప్రత్యేక ఉప కలెక్టర్ పరిధిలో ఆరు మండలాలకు చెందిన తహసీల్దార్లు పనిచేస్తున్నారు. వినతి స్వీకరించిన వెంటనే సంబంధిత మండల తహసీల్దార్‌తో మాట్లాడి పరిష్కారానికి చర్యలు ప్రారంభిస్తారు. ఇలా ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో 200 పైగా అర్జీలు వస్తున్నాయి. వీటిని పరిష్కరించడంలో అలసత్వం వహిస్తుండడంతో అర్జీలు పేరుకుపోతున్నాయి.

రెవెన్యూ క్లినిక్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఆరు సార్లు కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధరకాల భూ సంబంధిత సమస్యలపై 938 అర్జీలు వచ్చాయి. వీటిలో 404 మాత్రమే పరిష్కరించారు. 534 అర్జీలను పరిష్కరించలేదు. పూర్తి అర్జీల్లో సగం కూడా పరిష్కరించలేక పోయారు. ప్రతి బుధవారం కలెక్టర్ రెవెన్యూ క్లినిక్ అర్జీలపై సమీక్ష చేపట్టి పరిష్కారం శాతం పెంచాలని చెబుతున్న రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

రెవెన్యూ క్లినిక్‌లో వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో తహసీల్దార్లు బాధ్యత తీసుకొని పరిష్కరించాల్సి ఉంది. గరిష్ఠంగా అర్జీలకు సమస్య తీవ్రతను బట్టి 75 రోజులు గడువు ఇస్తున్నారు. అధికారులు, సిబ్బందికి ఇది సాకుగా మారింది. చాలా అర్జీలను సరైన పరిష్కారం చూపకుండానే ముగించేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రీ సర్వే భూ సరిహద్దు లోపాలు, ఆర్ఓఆర్, జాయింట్ ఎల్‌పీఎంలు, మ్యుటేషన్, వెబ్‌ల్యాండ్‌లో విస్తీర్ణం నమోదు, డి-పట్టా భూముల ఆక్రమణకు సంబంధించి అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. వీటిని పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధి చూపడం లేదని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన పరిష్కారం చూపకపోతే రెవెన్యూ క్లినిక్ ఎందుకని బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు

రెవెన్యూ క్లినిక్‌కు అందిన దరఖాస్తుల వివరాలివీ..

| స్వభావం | అర్జీలు | పరిష్కరించినవి | పెండింగ్‌లో ఉన్నవి |
|---|---|---|---|
| నిషేధిత జాబితా | 194 | 133 | 61 |
| రీ సర్వే లోపాలు | 130 | 41 | 89 |
| ఆర్ఓఆర్ | 223 | 69 | 154 |
| ఆక్రమణలు | 72 | 25 | 47 |
| భూవివాదం | 24 | 9 | 15 |

# పెరుగుతున్న హైరిస్క్ ప్రసవాలతో కలవరం



**అనకాపల్లి, విశాఖసమాచారం:** తొమ్మిది నెలలూ కడుపున మోసిన బిడ్డను కళ్లారా చూసి.. ప్రేమతో దగ్గరకు తీసుకోవాలని ప్రతి మహిళా తపిస్తుంది. ప్రసవం సురక్షితంగా జరిగినప్పుడే ఈ కల నెరవేరుతుంది. జిల్లాలో ప్రమాదకర ప్రసవాల సంఖ్య పెరుగుతుండటం కలవరం కలిగిస్తోంది. గర్భం దాల్చింది మొదలు ప్రసవమయ్యే వరకు మెరుగైన వైద్యసేవలు అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. కానీ మాతా, శిశు మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. జిల్లాలో ఇప్పటివరకు ఎనిమిది మంది బాలింతలు చనిపోవడంపై స్వయంగా జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గర్భిణుల్లో హైరిస్క్ కేసులు పెరగడానికి గల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆరోగ్య కేంద్రాల నుంచి చివరి నిమిషంలో జిల్లా, ఏరియా ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇక్కడి నుంచి కేజీహెచ్‌కు పంపేస్తున్నారు. జిల్లాలో మృతిచెందిన కేసుల్లో ఎక్కువగా ఇలా జరిగినవే ఉన్నాయి.జిల్లాలో గర్భిణుల హైరిస్క్ కేసులను గుర్తించి దీనికి తగ్గట్టుగా వైద్య సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశాం. దీనిపై వైద్యాధికారులకు శిక్షణ ఇస్తున్నాం, మాతా, శిశు మరణాలు అన్నవి లేకుండా చేయడమే ధ్యేయంగా సిబ్బంది పనిచేయాలి. ఆసుపత్రుల పరిధిలో మరణాలు సంభవిస్తే ఊరుకునేది లేదు. దీన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తాం. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యేంతవరకు మెరుగైన వైద్యసేవలు అందించాలి. ఏమైనా ఇబ్బందులుంటే ముందుగానే గుర్తించి

| ఏడాది | గర్భిణులు | హైరిస్క్ | మరణాలు |
|---|---|---|---|
| 2023-24 | 24,904 | 5276 | 13 |
| 2024-25 | 24,113 | 4267 | 13 |
| 2025-26 | 18,807 | 3914 | 8 |

కారణాలను వైద్యాధికారులు అన్వేషిస్తున్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి నెలలు నిండి ప్రసవం అయ్యేంతవరకు అందిస్తున్న చికిత్సను సంబంధిత వైద్యులు రికార్డులో నమోదు చేస్తున్నారు. ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి దీనికి తగ్గట్టుగా వైద్యం అందిస్తున్నారు. ఎక్కువగా రక్తహీనత వల్ల హైరిస్క్ కేసులు పెరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్లే ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. దీన్ని నివారించేలా మందులు అందిస్తున్నారు. చాలామంది మందులు వేసుకుంటున్నాం కదా అంటూ పోషకాహారం తీసుకోవడం లేదు. దీంతో తగిన వైద్యాన్ని అందించాలి.జిల్లాలో గర్భిణుల హైరిస్క్ కేసులను గుర్తించి దీనికి తగ్గట్టుగా వైద్య సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశాం. దీనిపై వైద్యాధికారులకు శిక్షణ ఇస్తున్నాం, మాతా, శిశు మరణాలు అన్నవి లేకుండా చేయడమే ధ్యేయంగా సిబ్బంది పనిచేయాలి. ఆసుపత్రుల పరిధిలో మరణాలు సంభవిస్తే ఊరుకునేది లేదు. దీన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తాం. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యేంతవరకు మెరుగైన వైద్యసేవలు అందించాలి. ఏమైనా ఇబ్బందులుంటే ముందుగానే గుర్తించి తగిన వైద్యాన్ని అందించాలి.

# పనుల జోరు పరిశ్రమలకు నీరు



**పాయకరావుపేట, విశాఖసమాచారం:** పాయకరావుపేట, పరిశ్రమలకు ఏలేరు నీటిని చేర్చే పైపులైన్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. త్వరలోనే పనులు పూర్తిచేసే దిశగా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పరిశ్రమ, ఆర్సెలార్ మిత్తల్, నిప్పన్ ఉక్కు పరిశ్రమకు పైపులైను ద్వారా నీరు అందించనున్నారు.

విశాఖ - చెన్నై కోస్టల్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పథకంలో భాగంగా ఏపీఐఐసీ నక్కపల్లి క్లస్టర్‌లో కొలువు తీరనున్న పరిశ్రమల నీటి అవసరాలు తీర్చేందుకు పైపులైను ఏర్పాటు చేస్తున్నారు. నాతవరం మండలం శరభవరం సమీపాన ఎంబీపట్నం నుంచి నక్కపల్లి మండలం డీఎల్‌పురం వరకు 53 కి.మీ. భారీ పైపులైను ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం రూ.331.80 కోట్లను వెచ్చిస్తున్నారు.

ఇప్పటికే ఏలేరు కాలువ పక్కన ఎం.బి.పట్నం వద్ద రెండు ఎకరాల్లో ఇన్‌టేక్ వెల్ పనులు జోరుగా సాగుతున్నాయి. దీని నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు. ఇక్కడి నుంచి గన్నవరం మెట్ట మీదుగా కాకినాడ జిల్లాలోని కోటనందూరు, డి.పోలవరం వరకు పైపులైను పనులు పూర్తి చేశారు. డి.పోలవరం నుంచి తుని వరకు మరో 8 కి.మీ., పాయకరావుపేట నుంచి డి.ఎల్.పురం వరకు కొత్త పైపులైను ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటికోసం భారీ సైజు పైపులను గుజరాత్ నుంచి తీసుకువస్తున్నారు. అక్కడి నుంచి నీటిని నిల్వ ఉంచేందుకు నక్కపల్లి మండలంలో ఏర్పాటు కానున్న స్టీల్‌ప్లాంట్ సమీపంలో మినీ రిజర్వాయర్ నిర్మించనున్నారు.

మరో ఐదు నెలల్లో పనులు పూర్తి...

వచ్చే నెల 21న ఉక్కు పరిశ్రమ పనులకు శంకుస్థాపన చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దీనిలోభాగంగానే మరో ఐదు నెలల్లో జులై నాటికి పైపులైను నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతేడాది జులై 10న ఈ పనులకు నాంది పలికారు. ఏడాది వ్యవధిలో నీటిని అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

# 'ధర'ఖాస్తు వద్దే తిర'కాసుంది

**విశాఖపట్నం విశాఖసమాచారం:** కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన బీపీఎస్ (భవన క్రమబద్ధీకరణ పథకం) కొందరు ఎల్టీపీ(లైసెన్స్ టెక్నికల్ పర్సన్)లకు వరంగా మారింది. భవన యజమానులతో దరఖాస్తులు చేయించడంతో పాటు, ఇతర వ్యవహారాలన్నీ వారే చూస్తుండటంతో... ఎక్కడికక్కడ జీవీఎంసీ ప్రణాళిక అధికారులతో కుమ్మక్కై నచ్చినంత వసూలు చేసి మాయ చేస్తున్నారు. ఇలా మోసపోతున్న వారిలో చాలా మంది జీవీఎంసీ కార్యాలయంలో ఫిర్యాదులు చేస్తున్నారు.

పెందుర్తి జోన్ పరిధిలో నిర్మించిన ఓ అపార్ట్‌మెంట్‌కు చెందిన వారు బీపీఎస్‌కు దరఖాస్తు చేయడానికి గోపాలపట్నం ప్రాంతంలో 'ఎల్టీపీ'ని సంప్రదించారు. అతడు దరఖాస్తులు చేయించడానికి వీలుగా ఒక్కొక్కరి నుంచి రూ.10 వేలకు బదులుగా రూ.15 వేలు చొప్పున వసూలు చేశాడు. అనంతరం మరో రూ.35 వేలు చొప్పున చెల్లించాలని, ఆన్‌లైన్‌లో రూ.8 వేలు చెల్లించి, మిగిలిన సొమ్ము నేరుగా చేతికివ్వాలని సూచించడంతో వారంతా ఇచ్చేశారు. బీపీఎస్ కింద చెల్లించాల్సిన సొమ్ము రూ.2.80 లక్షలు వరకు ఉందని, రూ.2.50 లక్షలకు తగ్గించేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎల్టీపీ పేర్కొనడం విశేషం. దీంతో అపార్ట్‌మెంట్ వాసులకు అనుమానం వచ్చి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.నిబంధనలు ఇలా గత ఏడాది ఆగస్టు 30 కంటే ముందు అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం బీపీఎస్ (భవన క్రమబద్ధీకరణ పథకం) తీసుకొచ్చింది. ప్లాన్‌కు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలతో పాటు, ప్లాన్ లేకుండా నిర్మించిన నిర్మాణాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది.

**చూసీచూడనట్టు..!**

ఆగస్టు 30 తర్వాత నిర్మించిన అక్రమ నిర్మాణాలను, అదనపు అంతస్తు లను తొలగించాలన్న ప్రభుత్వ ఆదేశాలను జీవీఎంసీ పట్టణ ప్రణాళికాధికారులు కొందరు పట్టించుకోకపోగా, అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పాతనగరంలో నిర్మిస్తున్న నాలుగు భారీ భవనాల్లో ఒక్కదానికీ అనుమతులు లేవు.

డాబాగార్డెన్స్ ప్రాంతంలో ప్లాన్ తీసుకోకుండానే ఓ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇదే విధంగా నగరంలో, శివారు ప్రాంతాల్లో అనేక భవనాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయి.

ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి: బీపీఎస్ దరఖాస్తులకు సంబంధించిన అపరాధ రుసుములు అన్నీ ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని, మాయ మాటలకు మోసపోవద్దని జీవీఎంసీ ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.అందజేస్తారు. డాబాగార్డెన్స్ ప్రాంతంలో ప్లాన్ తీసుకోకుండానే ఓ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇదే విధంగా నగరంలో, శివారు ప్రాంతాల్లో అనేక భవనాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయి.

ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి: బీపీఎస్ దరఖాస్తులకు సంబంధించిన అపరాధ రుసుములు అన్నీ ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని, మాయ మాటలకు మోసపోవద్దని జీవీఎంసీ ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

**నిబంధనలు ఇలా..**

గత ఏడాది ఆగస్టు 30 కంటే ముందు అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం బీపీఎస్ (భవన క్రమబద్ధీకరణ పథకం) తీసుకొచ్చింది. ప్లాన్‌కు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలతో పాటు, ప్లాన్ లేకుండా నిర్మించిన నిర్మాణాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది.

# సుప్రీం కోర్టు ఆదేశాలతో అనంతబాబు దంపతుల్లో కలవరం



**కాకినాడ** : దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిరూపణకు అవసరమైన బలమైన సాక్ష్యాలను, సాంకేతిక ఆధారాలను సిట్ సేకరించింది. హత్యకు ముందు, తర్వాత సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన ఫుటేజిలన్నింటినీ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శాస్త్రీయంగా విశ్లేషించింది. ఈకేసులో వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుతో పాటు అతని భార్య లక్ష్మీదుర్గ అలియాస్ రోజా పాత్ర కూడా నిర్ధారించి రెండో నిందితురాలిగా చేర్చి అనుబంధ ఛార్జిషీట్ వేసింది. ఈ పరిణామాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న అనంతబాబుకు తాజాగా ఈ కేసు ట్రయల్స్ పూర్తిచేయడానికి సుప్రీంకోర్టు గడువు విధించడంతో ముచ్చెమటలు పడుతున్నాయి. కేసును మరికొన్నాళ్లు సాగదీసి శిక్ష నుంచి తప్పించుకోవచ్చని అనుకున్న అతనికి సుప్రీం కోర్టు షాక్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో భార్యాభర్తలిద్దరూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

**ముందస్తు ప్రణాళికతోనే హత్య..**

సీసీ కెమెరాల్లో ఫుటేజీలను విశ్లేషించాక అనంతబాబు, ఆయన భార్య లక్ష్మీదుర్గ ముందస్తు ప్రణాళికతోనే సుబ్రహ్మణ్యాన్ని హత్యచేసినట్లు స్పష్టమైంది.

2022 మే 19 రాత్రి హత్య సమయంలో అనంతబాబు ఫుల్ స్లీవ్ షర్ట్, ముఖానికి మాస్క్ ధరించగా ఆయన భార్య పింక్ రంగు చీరలో ఉన్నట్లు కెమెరా దృశ్యాల్లో కనిపించింది. హత్య అనంతరం సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని కారు వెనుకసీటులో వేసుకుని తమ అపార్ట్‌మెంటుకే వచ్చి అనంతబాబు దుస్తులు మార్చుకున్నాడు. తెల్లవారుజామున 4.43 నుంచి 5 గంటల మధ్య అనంతబాబు మరోసారి వేర్వేరు దుస్తులు మార్చుకున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఆధారాలు మాయం చేయడానికే ఈ విధంగా చేసుంటాడని ఫోరెన్సిక్ నివేదికలో ప్రస్తావించారు.

హత్య జరిగిన రోజు కాకినాడ నగరంలోని 14 ప్రాంతాలోని కెమెరాల్లో వీరి కదలికలు రికార్డయ్యాయి. అన్నీ అనుమానాస్పదంగానే ఉన్నాయి.

హత్య సమయంలో తాను లేనని, ఆసుపత్రికి వెళ్లానని గతంలో అతని భార్య ఇచ్చిన వాంగ్మూలానికి, ఆమె సీసీ కెమెరాల్లో కనిపించిన సమయాన్ని పోల్చి.. ఆమె చెప్పినదంతా అబద్ధమేనని తేల్చారు.

వారు నివాసం ఉండే శంకర్ టవర్స్‌లో కెమెరాలన్నీ పనిచేస్తున్నాయి. అపార్ట్‌మెంట్ బయట ఉన్నదానిలో మాత్రం దృశ్యాలు లభించకపోవడం అనుమానాలకు మరింత బలం చేకూరింది.

**ఈ తీర్పు మనోధైర్యం ఇచ్చింది..**

దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసులో ఆ రోజు ఎమ్మెల్సీ అనంతబాబు మధ్యస్థ బెయిల్ పొంది, జైలు నుంచి దండలతో ఊరేగింపుగా సాగిన సంఘటన చూశాం. అలాంటి కేసును న్యాయస్థానం సీరియస్‌గా తీసుకుని త్వరితంగా విచారించాలని పేర్కొంది. అందుకు అవసరమైన ఏర్పాట్లుచేయాలని హైకోర్టుకు చెప్పింది. హత్య చేసి డోర్ డెలివరీతో భయానక వాతావరణం కల్పించిన ఘటనలో ఈ తీర్పు అందరికీ మనోధైర్యాన్నిచ్చింది. పాలకులు, పోలీసులు కలిసినా చట్టం నుంచి తప్పించుకోలేరని సుప్రీం తీర్పు స్పష్టం చేసింది. దళిత, బడుగు, బలహీన వర్గాలకు మనోధైర్యాన్ని ఇచ్చిన తీర్పు ఇది. విధి నిర్వహణ లోపానికి పాల్పడిన పోలీసు అధికారులు శిక్షకు గురవుతారు.

# ఎవరెస్ట్ అధిరోహణకు విద్యార్థిని ఎంపిక



**కాజులూరు** : దివ్యాంగుల విభాగం నుంచి ఎవరెస్ట్ అధిరోహణకు కాజులూరు మండలం గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని పితాని రూపాసాయిశ్రీ ఎంపికైె నట్టు ఎంఈఓ డేవిడ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆ పాఠశాలలో స్కూల్ హెచ్‌ఎం ఎస్ఎస్‌బి సుశీలామణి ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. పది రోజుల క్రితం కడప జిల్లా గండికోటలో ప్రత్యేక అవసరాల కేటగిరీలో దివ్యాంగుల విభాగం నుంచి ఎవరెస్ట్ అధిరోహికుల ఎంపిక జరిగిందన్నారు. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల విభాగం నుంచి గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని రూపాసాయిశ్రీ ఎంపికైె ందన్నారు. లడాక్‌లో ఈ నెల 23 నుంచి మార్చి 6వ తేదీ వరకూ శిక్షణ ఇచ్చి ఎవరెస్ట్ అధిరోహణకు పంపిస్తారన్నారు. రూపాసాయిశ్రీని స్కూల్ పీడీ జి.సునీల్‌కుమార్, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముర్రె శివశంకర్, సర్పంచ్ ప్రసన్నమౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి తదితరులు అభినందించారు. గొల్లపాలేనికి చెందిన విద్యార్థిని ఎవరెస్ట్ అధిరోహణకు ఎంపిక కావడమే కాకుండా ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు కాజులూరు దివ్యాంగుల పాఠశాల ఉపాధ్యాయుడు ఎంజే జయప్రకాశ్‌రెడ్డి కోచ్‌గా ఎంపిక కావటం గర్వించదగ్గ విషయమని ఎంఈఓ డేవిడ్ అన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైె న 25 మంది విద్యార్థులకు జయప్రకాశ్‌రెడ్డి నిపుణులతో లడాక్‌లో శిక్షణ ఇచ్చి, ఎవరెస్ట్ అధిరోహణకు తీసుకు వెళ్తారన్నారు.

# సీఎం సహాయ నిధితో బాధిత కుటుంబాలకు ఆర్థిక ఊరట - రూరల్ ఎమ్మెల్యే నానాజీ




**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్** : అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. గొడారి గుంటలోని తన కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) ద్వారా మంజూరైన చెక్కులను 12 మంది లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం రూ.7,72,651 విలువైన ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబాలకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కుల పంపిణీ ప్రక్రియలో ఎవరైనా లబ్ధిదారుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సలకు కూడా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని పేర్కొన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఇప్పటివరకు 303 దరఖాస్తులను సీఎంఓ కార్యాలయానికి పంపగా, అందులో 208 మందికి సుమారు రూ.2 కోట్ల ఆర్థిక సాయం అందించామని, మిగిలిన 95 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. కుటుంబంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శిరంగు శ్రీనివాస్ నల్లే ప్రసన్న కరెడ్ల గోవింద్ నల్లం శ్రీరాములు సోదే ముసలయ్య పాండ్రంకి రాజు యాళ్ల పండు పేపకాయల అంజి కోనేటి రామకృష్ణ గౌతమ్ అనుకూల రాంబాబు అన్నవరం జోకా తాతాజీ గండి వెంకటేశ్వరరావు సంఘాడి శ్రీను రెడ్డి లోవరాజు గీశాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవలో నిర్లక్ష్యం సహించం.. - జగన్ పై కూటమి నేతలు ఘాటు వ్యాఖ్యలు



**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్** : తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కూటమి పార్టీ నేతలు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులను తిరుమలకు జీవితాంతం రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. శనివారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ఈ అభిప్రాయాన్ని వెల్లడించారు. స్వామివారి లడ్డూ తయారీలో అవకతవకలు జరిగి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, ఎమ్మెల్యేలు పంతం వెంకటేశ్వరరావు వనమాడి వెంకటేశ్వరరావు జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ తదితరులు మాట్లాడుతూ వైసీపీ పాలనలో సుమారు 20 కోట్ల లడ్డూల తయారీలో నాణ్యత లోపించిందని, నెయ్యి వినియోగంలో కూడా అనియమితాలు జరిగాయని ఆరోపించారు. పరకామణి వ్యవహారంలోనూ అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు స్వామివారి ఫోటోను పట్టుకుని హేళన చేసిన ఘటనపై కూడా ఏడాది పాటు తిరుమలకు రాకుండా నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిని గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

# కార్మికుడి ఇంట్లో బుల్లెట్లు..!

**చాగల్లు,** : తుపాకీ బుల్లెట్లు కలిగి ఉన్న వ్యక్తిని కొవ్వూరు గ్రామీణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై కె.శ్రీహరి తెలిపిన వివరాలు.. ఉత్తరప్రదేశ్‌లోని నాదిబొంగి గ్రామానికి చెందిన సమీర్ హుస్సేన్ ఏడేళ్ల కిందట కొవ్వూరు మండలం దేచర్ల గ్రామానికొచ్చి, ఓ కర్మాగారంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం పోలీసులు హుస్సేన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 9 ఎంఎం పిస్టల్ బుల్లెట్లు తొమ్మిది, 315 రైఫిల్‌లో వాడే పాయింట్ 8 ఎంఎం బుల్లెట్లు ఆరు స్వాధీనం చేసుకున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో హుస్సేన్ స్వగ్రామానికి వెళ్లి తిరిగి దేచర్లకు వస్తున్న క్రమంలో రైలులో పరిచయమైన ఆదిత్యరాజ్ నుంచి 15 బుల్లెట్లను తీసుకున్నాడు. ఇతడు అలహాబాద్ జీఆర్‌పీ (గవర్నమెంట్ రైల్వే పోలీస్) స్టేషన్‌లో ఒక గంజాయి కేసులో, 5 చోరీ కేసులలో నిందితుడిగా ఉన్నాడు. హుస్సేన్ నేర ప్రవృత్తితోనే తన వద్ద బుల్లెట్లు ఉంచుకున్నట్లు దర్యాప్తులో తేలిందని.. ఆదిత్యరాజ్ రాజమహేంద్రవరానికి గంజాయి ఇతర నేర ఆలోచనతో వచ్చినట్లు తెలుస్తోందని తెలిపారు. ఆదిత్యరాజ్ కోసం ఆచూకీ వెదుకుతున్నట్లు పేర్కొన్నారు.

# వసతులు కల్పిస్తూ.. నైపుణ్యాలు పెంచుతూ..



**రాజానగరం** : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో నన్నయ విశ్వవిద్యాలయం చదువుల తరువుగా పేరొందింది. యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో కొన్నివేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏడో కులపతిగా బాధ్యతలు చేపట్టిన వీసీ ప్రసన్నశ్రీ వచ్చి ఏడాది కాలం పూర్తయ్యింది. వసతులు, సాధించిన పురోగతి, నెలకొన్న సమస్యలు, సవాళ్లు తదితర అంశాలపై 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో పలు విషయాలు వెల్లడించారిలా..

**వివిధ సంస్థలతో ఒప్పందాలు..**

విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకునేలా, పారిశ్రామిక నైపుణ్యాలు పెంచుకునేలా, ఉపాధి పొందేలా వివిధ సంస్థలతో ఎంవోయూ కుదుర్చుకున్నాం. టీసీఎల్, ఇన్‌ఫ్లిబ్‌నెట్, పెరూ లోని ప్రిన్ కనర్స్ వర్శిటీ, పింక్‌మైన్ టెక్నాలజీస్, శ్రీలంకలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్, నాంది ఫౌండేషన్ తదితర వాటితో అవగాహన ఒప్పందాలు జరిగాయి. ఈ సంస్థలతో యువతకు ప్రత్యేక తరగతులు, శిక్షణ ఇప్పించడం ద్వారా మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయి.

**రూ.34 కోట్లతో నిర్మాణాలు..**

కూటమి ప్రభుత్వం చొరవతో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. ఇటీవల సుమారు రూ.34 కోట్లతో నిర్మించిన ఇంజినీరింగ్ కళాశాల, పరీక్షల భవనాలు, ఎంబీయే, మేనేజ్‌మెంట్ స్టడీస్ భవనాలను ప్రారంభించాం. నీటి కొరత పరిష్కారానికి, నాణ్యతకు ఆర్వోప్లాంట్లను పునరుద్ధరించి, నూతన పైపులైన్లు ఏర్పాటు చేశాం. బాలుర, బాలికల వసతి గృహాలు, మినీ యాంపీ థియేటర్ నిర్మాణంలో ఉన్నాయి. యూనివర్సిటీ ప్రాంగణంలో ఆర్ట్స్ కళాశాల భవనాలు నిర్మించాలి..


**ఎన్నెన్నో ప్రత్యేకతలు..**

యోగాంధ్ర-2025 యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, మిరాకిల్స్ వరల్డ్ రికార్డ్స్ వచ్చాయి. వందేమాతరం-150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఇటీవల చేపట్టిన కార్యక్రమానికి సైతం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. వివిధ కార్యక్రమాల ద్వారా సాధించిన ప్రగతితో ఫైవ్ స్టార్ రేటింగ్ సర్టిఫికేషన్ లభించింది.

**మరిన్ని నిధులు ఉంటేనే..**

ఇటీవలి రాష్ట్ర బడ్జెట్‌లో నన్నయకు రూ.12 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలోని అతిపెద్ద యూనివర్సిటీ కావడంతో ఈ నిధులు సరిపోవు. మరింత కేటాయిస్తేనే అభివృద్ధి పనులు చేపట్టగలం. రెగ్యులర్ సిబ్బంది అధిక సంఖ్యలో లేకపోవడంతో అనుకున్నంత వేగంగా కొన్ని పనులు జరగట్లేదు. విశ్వవిద్యాలయంలో అధికారులు, సిబ్బంది చిన్నారుల కోసం బేబీ డే కేర్ సెంటర్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

# మాక్వేరి విశ్వవిద్యాలయంతో 'ఆదిత్య' ఒప్పందం



**గండేపల్లి** : సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం ఆస్ట్రేలియాలోని మాక్వేరి విశ్వవిద్యాలయంతో డ్యూయల్ డిగ్రీ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆదిత్య డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిత్య అండర్ గ్రాడ్యుయేట్ అధ్యయనాల మొదటి, రెండు సంవత్సరాలు ఆదిత్యలో, మిగతా రెండేళ్లు ఆస్ట్రేలియాలోని మాక్వేరి విశ్వవిద్యాలయంలో చదవాల్సి ఉంటుంన్నారు. విద్య, క్రెడిట్ అవసరాలను విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం విద్యార్థులకు రెండు విశ్వవిద్యాలయాల నుంచి డిగ్రీ ప్రదానం చేస్తామన్నారు. విద్యార్థులు ఫ్రేమ్‌వర్క్ కింద ఆదిత్య నుంచి బీటెక్ డిగ్రీ, సంబంధిత స్పెషలైజేషన్‌లో మాక్వేరి విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఆనర్స్) డిగ్రీతో పట్టభద్రులవుతారన్నారు. ఈ అవగాహన ఒప్పందంలో ఆదిత్య నుంచి ప్రో చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి, వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ ఎంబీ శ్రీనివాస్, అంతర్జాతీయ సంబంధాల డీన్ ప్రొఫెసర్ ఎస్.రంజిత్.పి, అడ్మినిస్ట్రేషన్ డీన్ ప్రొఫెసర్ సత్యనారాయణ వెల్ల, మాక్వేరి తరఫున ప్రో వైస్ చాన్సలర్ లీ ఆన్ నోరిస్, ఎగ్జిక్యూటివ్ డీన్ ప్రొఫెసర్ శామ్యూల్ ముల్లర్, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ రే ఈటన్, డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ శామ్యూల్ ముల్లర్ తదితరులు పాల్గొన్నారు.

# 'లైట్లు' ఓకే.. అన్నీ 'వెలగకే'

**పిఠాపురం** : కత్తిపూడి దిగమర్రు 216 జాతీయ రహదారిలో గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద (గొల్లప్రోలు ఊళ్లకి వెళ్లే దారి దగ్గర) అటు, ఇటు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. కానీ ఒక్క రోజు అవి వెలిగిన సందర్భం లేదు. రూ.కోట్లలో టోల్ ఫీజులు వసూలు చేయడం తప్ప, ఇక్కడ లైట్లు వెలిగించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

# టిప్పర్ ఢీకొని యువకుడి మృతి



**అనపర్తి** : మోటార్ సైకిల్‌ను టిప్పర్ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. అనపర్తి మార్కండేయపురానికి చెందిన సబ్బెళ్ల గౌరీశంకర్‌రెడ్డి కుమారుడు వీర ప్రకాష్‌రెడ్డి (26) రాత్రి 11.15 గంటలకు అనపర్తి సెంటర్‌కు వెళ్లి తిరిగి నల్ల కాలువ వైపు మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. ఈ నేపథ్యంలో వెనుక నుంచి టిప్పర్ వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొంది. టిప్పర్ ముందు చక్రాల కింద వీరప్రకాష్‌రెడ్డి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ తెలిపారు.

# విద్యార్థిని అదృశ్యం



**అమలాపురం డెక్కన్ న్యూస్** : స్థానిక మున్సిపల్ కాలనీకి చెందిన, 9వ తరగతి విద్యార్థిని అమలదాసు హషిత (14) అదృశ్యమైంది. దీనిపై పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో ఎస్సై ఎన్‌ఆర్ కిషోర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హషిత గురువారం సాయంత్రం స్థానిక రవణం మల్లయ్య వీధిలోని ట్యూషన్‌కు ఇంటి నుంచి బయలు దేరింది. మళ్లీ తిరిగి రాలేదు. ట్యూషన్‌కూ చేరుకోలేదు. సీఐ వీరబాబు, ఎస్సై కిషోర్‌బాబులు రాత్రి రవణం మల్లయ్యవీధి తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాల పుటేజ్‌లను పరిశీలించారు. సీసీ పుటేజీల్లో బాలిక పది మీటర్లు ముందుకు వెళ్లి వెనక్కి తిరిగిన దృశ్యాన్ని గుర్తించారు. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు. ఆ బాలిక సమాచారం తెలిస్తే 94407 96561, 81435 79127 నంబర్లకు తెలపాలన్నారు.

# వసతుల కల్పనలో విఫలం



**వాడపల్లి** : వెంకన్న ఆలయంలో తొలినాళ్లలో అన్నదాన పథకాన్ని రూ.200 నిధితో ప్రారంభించారు. అది కాస్త ఇప్పుడు రూ.కోట్లకు చేరింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భక్తుల ఇబ్బందులు గమనించి 2023లో అన్నదాన భవన (వకుళమాత భవనం) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో సుమారు రూ.6.25 కోట్లతో పనులు ప్రారంభించారు. అక్కడ ఒకేసారి సుమారు 50 వేల మంది భక్తులు కూర్చుని ప్రసాదం స్వీకరించేలా కార్యాచరణ చేశారు. ఈ భవనం నిర్మాణానికి ఇప్పటికే దాతలు రూ.15కోట్లకు పైగా విరాళాలు సమర్పించారు. ఇంకా అందిస్తున్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ భవన పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధులు వెల్లువలా వస్తున్నా, పనులు మాత్రం వేగం పుంజుకోవడం లేదు. దీనివల్ల భక్తులకు అవస్థలు తప్పడం లేదు. పనులు సకాలంలో జరగక దాతల ఆశయమూ నెరవేరడం లేదు. తాత్కాలిక షెడ్డులోనే ప్రతి శనివారం సుమారు 30 వేల మందికి పైగా భక్తులు భోజనాలు చేయడానికి నానా యాతన పడుతున్నారు. వాడపల్లి దేవస్థానంలో వకుళమాత అన్నదాన భవనం నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కృషి చేస్తున్నాం. ఆ పనులు పూర్తిగా ఇంజినీరింగ్ విభాగం చూసుకుంటోంది. భక్తుల అన్నదానానికి ఎలాంటి ఇబ్బంది రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

# విశాఖ చేరుకున్న రోటరీ పోలియో ఫండ్ సైకిల్ యాత్ర



**విశాఖసమాచారం:** గత మూడు రోజులుగా రోటరీ డిస్ట్రిక్ట 3020, గవర్నర్ డాక్టర్ వై కళ్యాణ్ చక్రవర్తి గారు రోటరీ పోలియో ఫండ్ కోసం సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన స్వయంగా ఇచ్చాపురం నుంచి విజయవాడ వరకు చేపట్టారు. ఆయన నిన్న మధ్యాహ్నం నాలుగున్నర గంటలకు విశాఖపట్నం కి 300km సైకిల్ తొక్కుతూ చేరుకున్నా రు. ఆయనని ప్రశంసిస్తూ వైజాగ్ లో ఉన్న అన్ని రోటరీ క్లబ్బులు కలిసి ఈరోజు వాల్తేర్ క్లబ్లో ఆయనకు పది లక్షల రూపాయలు పోలియో ఫండును అందజేశారు. ఈ కార్యక్రమంలో కంటిపూడి వెంకటేశ్వర గారు లక్ష రూపాయలు ప్రకటించారు ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ పోలియో చైర్ పార్థసారథి గారు, రీజినల్ పోలియో చైర్ రాంబాబు గారు, డిస్టిక్ సెక్రెటరీ బాబి,ఖాళీ ప్రసాద్ గారు, నరేన్ , శివ కుమార్ రెడ్డి, అడపా భాస్కర్, రఘు, శివాజీ, కామేశ్వరరావు, డి ఎం రావు, నందిని , సత్య శ్రీ, నీరజ, శ్రీనివాస్, రఘుపతి, వంశీ,సత్య శ్రీ దేవి, రవి కిరణ్, మహేష్, రెడ్డి, భార్గవ్ మొదలగువారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిస్టిక్ గవర్నర్ గారు మాట్లాడుతూ, ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, వారి అవసరం పోలియో నిర్మూలనకు చాలా ఉంది అని తెలియజేశారు.

గత మూడు రోజులుగా రోటరీ డిస్ట్రిక్ట 3020, గవర్నర్ డాక్టర్ వై కళ్యాణ్ చక్రవర్తి గారు రోటరీ పోలియో ఫండ్ కోసం సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన స్వయంగా ఇచ్చాపురం నుంచి విజయవాడ వరకు చేపట్టారు. ఆయన నిన్న మధ్యాహ్నం నాలుగున్నర గంటలకు విశాఖపట్నం కి 300ఎఎ సైకిల్ తొక్కుతూ చేరుకున్నా రు. ఆయనని ప్రశంసిస్తూ వైజాగ్ లో ఉన్న అన్ని రోటరీ క్లబ్బులు కలిసి ఈరోజు వాల్తేర్ క్లబ్లో ఆయనకు పది లక్షల రూపాయలు పోలియో ఫండును అందజేశారు. ఈ కార్యక్రమంలో కంటిపూడి వెంకటేశ్వర



గారు లక్ష రూపాయలు ప్రకటించారు ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ పోలియో చైర్ పార్థసారథి గారు , రీజినల్ పోలియో చైర్ రాంబాబు గారు, డిస్టిక్ సెక్రెటరీ బాబి,ఖాళీ ప్రసాద్ గారు, నరేన్ , శివ కుమార్ రెడ్డి , అడపా భాస్కర్, రఘు, శివాజీ, కామేశ్వరరావు, డి ఎం రావు, నందిని , సత్య శ్రీ, నీరజ, శ్రీనివాస్, రఘుపతి, వంశీ,సత్య శ్రీ దేవి, రవి కిరణ్, మహేష్, రెడ్డి, భార్గవ్ మొదలగువారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిస్టిక్ గవర్నర్ గారు మాట్లాడుతూ, ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, వారి అవసరం పోలియో నిర్మూలనకు చాలా ఉంది అని తెలియజేశారు.

విశాఖ వ్యాలీ, వాల్తేరు, వైజాగ్ డైమండ్స్, విశాఖ సెంటెన్నియల్, విశాఖ సురభి, విశాఖ సౌత్, వైజాగ్ మెట్రో, విశాఖపట్నం, విశాఖ సిటీ పెరల్ రోటరీ కంటిపూడి ఒక లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. గతంలో కూడా రెండు సార్లు లక్ష రూపాయలు చొప్పున ఇచ్చారు. పోలియో నిర్మూలనకు ఆయన విరాళాలు ఇచ్చారు.

# వివాదాల పరిష్కారానికి పీస్ కమిటీ ఏర్పాటు




**- రెండు వర్గాల వివరణలు, అభ్యంతరాలు తెలుసుకున్న కమిటీ - సాక్ష్యాధారాలు సమర్పించడానికి సోమవారం వరకు గడువు**

**- మార్చి 2వ తేదీన మరోపర్యాయం సమావేశం**

**- అప్పటి వరకు ఎటువంటి ధర్నాలు, నిరసనలు చేయరాదు**

**ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖసమాచారం:** ఆంధ్రవిశ్వ విద్యాలయంలో గత కొన్ని రోజులుగా విద్యార్థి సంఘాల మధ్య జరుగుతున్న వివాదాన్ని పరిష్కరించడానికి ప్రత్యేకంగా ఒక పీస్ కమిటిని ఏర్పాటు చేశారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ సమక్షంలో రెక్టార్ ఆచార్య పి.కింగ్, ఆర్డిఓ సుధా సాగర్, తూర్పు ఏసీపీ లక్ష్మణ మూర్తిలు విద్యార్థి సంఘాలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రెండు విద్యార్థి సంఘాల నుంచి వారి వాదనలు, అభ్యంతరాలను విన్నారు. వివాదానికి సంబంధించిన వీడియోలు, సాక్ష్యాధారాలను సోమవారం మధ్యాహ్నంలోగా రిజిస్ట్రార్కు అందించాలని రెండు వర్గాలను సూచించారు. ఎస్.ఎఫ్.ఐ- ఏ.ఐ.ఎస్.ఎఫ్లు, ఏబివిపి లకు సంబంధించిన నాయకుల నుంచి వారి వినతులు, అభ్యంతరాలను పీస్ కమిటి సభ్యులు సావధానంగా విన్నారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన సుదీర్ఘ సమావేశంలో ఇరు వర్గాలకు సంబంధించిన వాదనలు విన్నారు. విద్యార్థులు స్వేచ్ఛగా తమ ఆలోచనలు, అభ్యంతరాలు తెలియజేశారు. అదే విధంగా మార్చి 2వ తేదీన పీస్ కమిటీ మరోపర్యాయం సమావేశం అయి తుది నిర్ణయం వెలువరిస్తుందని చెప్పారు. ఆ నిర్ణయానికి రెండు విద్యార్థి సంఘాలు కట్టుబడి ఉండాలని చెప్పారు. పీస్ కమిటి తమ నిర్ణయం వెలువరించే వరకు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రెండు వర్గాలు ఎటువంటి కార్యక్రమాలు, ధర్నాలు, నిరసనలు తెలపకూడదని స్పష్టం చేశారు. దీనికి అందరూ ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

ఆర్డిఓ సుధా సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు వివాదాలలో భాగం కావద్దని, ఇవి వారి భవిష్యత్తుకు అవరోధాలుగా మారుతాయనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. విద్య సంబంధ వాతావరణాన్ని ఎవరూ భంగం చేయవద్దని, కెరియర్పై దృష్టి సారించాలని సూచించారు. కమిటి నిస్పక్షపాతంగా తన నిర్ణయాన్ని వెలువరిస్తుందని, దానిని అందరూ పాటించాలని తెలిపారు. సమావేశం అనంతరం వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి వివాదాలకు దిగకుండా, సామరస్యంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ప్రస్తుతం ఎటువంటి ధర్నాలు చేయవద్దని సూచించామన్నారు. శాంతి కొనసాగాలంటే విద్యార్థులు బయట మాట్లాడకుండా ఉండటం, సంయమనం పాటించడం మంచిదన్నారు. క్యాంపస్ సామరస్యం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. వర్సిటీలో నాన్ బోర్డర్స్కు స్థానం ఇవ్వకూడదని విద్యార్థులకు సూచించామన్నారు. దీనిపై ఇప్పటికే రెండు నోటీసులు సైతం జారీ చేసామని, అదే విధంగా నాన్ బోర్డర్స్ను పంపే ప్రక్రియను సైతం ప్రారంభించామన్నారు. నాన్ బోర్డర్స్కి స్థానం కల్పించే విద్యార్థులపైన కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు.

పీస్ కమిటి సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కె. రాంబాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య జాలాది రవి, ఎం.వి.ఆర్ రాజు, కె. సీతా మాణిక్యం, డి.నగరాజ కుమారి, ఆర్. పద్మశ్రీ, జి. గిరిజా శంకర్, ఎం.శశి, డీన్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏయూలో మళ్లీ రగడ



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థి సంఘాల మధ్య ఉద్రిక్తత కొనసాగుతోంది. గడిచిన కొద్దిరోజులుగా ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ/ఏఐఎస్ఎఫ్ నాయకుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొని ఉంది. ఏబీవీపీకి చెందిన నేతలు ఆర్ఎస్ఎస్ శాఖ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారంటూ ఎస్ఎఫ్ఐ/ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట ఏయూ వీసీ కార్యాలయం ఎదుట ఇరువర్గాలకు మధ్య తోపులాట జరిగిన విషయం తెలిసిందే. తప్పు చేసిన వారిపై చర్య తీసుకుంటామని, ఈ తరహా చర్యలకు స్వస్తి చెప్పాలని ఇరు సంఘాల నేతలకు వర్సిటీ అధికారులు స్పష్టం చేశారు. దీంతో గొడవ సర్దుమణిగిందని అంతా భావించారు. అయితే, తమపై దాడికి పాల్పడిన ఎస్ఎఫ్ఐ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ గోపి, జిల్లా కన్వీనర్ నితిన్, నగర కార్యదర్శి ప్రసాద్తోపాటు పలువురు శుక్రవారం ఉదయం ఏయూ ప్రధాన గేటు వద్ద నిరసన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ గూండాలపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ గూండాల పేరుతో తయారుచేసిన దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ఏబీవీపీ నాయకులు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో ఏబీవీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో ఏయూ ఆర్ట్స్ కాలేజీ పరిధిలోని పాలిటిక్స్ విభాగంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారన్న విషయం తెలియడంతో అక్కడకు వెళ్లి వారిని అడ్డుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో రెండు వర్గాలకు చెందిన నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఇరువర్గాల నాయకులు వేర్వేరుగా రిజిస్ట్రార్ను కలిసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ వినతులు సమర్పించారు. వారి వాదనలు విన్న రిజిస్ట్రార్ తప్పు చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇదిలావుంటే ఏయూ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇమ్మాన్యుయల్ రాజీనామా చేశారు. దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని రిజిస్ట్రార్ కె.రాంబాబు వెల్లడించారు.

**వివాదాల్లో తలదూర్చవద్దు: రిజిస్ట్రార్**

విద్యార్థులు తమ పూర్తి సమయాన్ని, సామర్థ్యాలను కెరియర్ను నిర్మించుకునే దిశగా వినియోగించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు సూచించారు. విద్యార్థి సంఘాల గొడవల నేపథ్యంలో ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్సిటీలో ఉన్న గ్రంథాలయం, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు తెలిసో,తెలియకో వివాదాల్లో భాగం అయితే భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకున్నట్టేనన్నారు. విద్యార్థులకు సంబంధించిన అంశాల్లో బయట వ్యక్తులు నేరుగా జోక్యం చేసుకోవద్దని, సమస్య ఉంటే వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. బయట వ్యక్తుల ప్రభావానికి విద్యార్థులు లోను కావద్దన్నారు.

# తుదిదశకు ఆలయ పనులు

**అనకాపల్లి, విశాఖసమాచారం:** అనకాపల్లి టౌన్, స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు ముగింపు దశకు రావడంతో ప్రారంభోత్సవానికి దేవదాయ శాఖ అధికారులు, ఆలయ పాలకవర్గం సుముహూర్తం నిర్ణయించారు. మార్చి ఎనిమిదో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభించాలని భావిస్తున్నట్టు సమాచారం. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాలతో పాలకవర్గం చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో శ్రీధర్ ఆలయంలో మిగిలిన పనులను వేగవంతం చేశారు. అనకాపల్లి ప్రజల ఇలవేల్పు అయిన నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని నిర్మించి దశాబ్దాలు కావడం, మరోవైపు ఏటేటా భక్తులు పెరుగుతుండడంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. రద్దీ అధికంగా వున్నప్పుడు భక్తులు ఒకింత అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో ఆలయాన్ని పునర్నిర్మించాలని దేవదాయ శాఖ ఉన్నతాధికారులు భావించారు. సుమారు రూ.11 కోట్ల అంచనా వ్యయంతో రెండున్నర సంవత్సరాల క్రితం పనులకు శ్రీకారం చుట్టారు. అమ్మవారి మూలవిరాట్టును మినహా మిగిలిన ఆలయం మొత్తాన్ని కూల్చివేశారు. భక్తులు దర్శించుకోవడానికి ఆలయ ఆవరణలోని కల్యాణ మండపాన్ని బాలాలయంగా మార్చి అమ్మవారి తాత్కాలిక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ హయాంలో కాంట్రాక్టర్కు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఆలయ పునర్నిర్మాణ పనులు మందకొడిగా సాగాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రత్యేక శ్రద్ధ వహించి, పనులను వేగవంతం చేయించారు. ఆలయ జీర్ణోద్ధరణ, పునర్మిర్మాణ పనుల కారణంగా 2023 జూన్ నుంచి అమ్మవారి మూలవిరాట్ దర్శనభాగ్యం లేకపోవడంతో భక్తులు ఒకింత నిరాశ చెందుతున్నారు.



దీంతో ఈ ఏడాది కొత్త అమావాస్య ఉత్సవాల ప్రారంభంనాటికి నూతన ఆలయం అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో పనులను వేగవంతం చేశారు. ఆలయం లోపల గచ్చు, క్యూలైన్ల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. విద్యుత్తు, రంగుల పనులు చివరి దశకు చేరాయి.

**విశాలంగా ఆలయం**

పాత ఆలయం పొడవు 98 అడుగులు, వెడల్పు 60 అడుగులు వుండగా, పునర్నిర్మాణంలో భాగంగా పొడవు 175 అడుగులు, వెడల్పు 94 అడుగులకు విస్తరింపజేశారు. గర్భాలయం పొడవు, వెడల్పు 14 అడుగుల చొప్పున ఉండేవి. పునర్నిర్మాణంలో భాగంగా 18 అడుగులకు పెంచారు. అంతరాలయం పొడవు 12 అడుగులు, వెడల్పు 14 అడుగులకు ఉండగా.. ఇప్పుడు పొడవు 18 అడుగులు, వెడల్పు 15 అడుగులకు విస్తరింపజేశారు. గతంలో అనివెట్టి మండపం పొడవు 27 అడుగులు, వెడల్పు తొమ్మిది అడుగులు ఉండగా, పునర్నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం పొడవు 55 అడుగులు, వెడల్పు 45 అడుగులకు పెరిగింది. సుమారు వంద అడుగుల పైబడి ఎత్తు, తొమ్మిది అంతస్థులతో తూర్పు వైపున రాజగోపురం నిర్మించారు. ఆలయం చుట్టూ మాడవీధులను ఏర్పాటు చేస్తున్నారు.

# తీరం కోతకు అడ్డుకట్ట



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** విశాఖపట్నం నుంచి భీమిలి వరకూ సముద్ర కోతకు గురవుతున్న 30కి పైగా ప్రాంతాలను సంరక్షించేందుకు విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్డీఏ) నడుం కట్టింది. అవకాశం ఉన్నంత మేరకు కేంద్ర నిధులు అధికంగా ఉపయోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో వీఎంఆర్డీఏ ఏడాది క్రితం తీరం కోత నివారణకు సమగ్ర ప్రాజెక్టును రూపొందించింది. కేంద్రానికి సమర్పించి నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ (ఎన్డీఎంఏ) నుంచి సాయం కోరింది. దీనికి రూ.203 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. అందులో 90 శాతం కేంద్రం సమకూరిస్తే, మిగిలిన 10 శాతం రాష్ట్రంలోని ఏపీ డిజాస్టర్ మేనేజ్మెంట్ అ౽థారిటీ నుంచి తీసుకుంటామని వెల్లడించింది.

**తీరం కోత నష్టాలపై నివేదిక**

కేంద్రం నుంచి వందల కోట్ల రూపాయలు మంజూరు కావాలంటే దానికి తగిన ఆధారాలు సమర్పించాలి. దీనికోసం వీఎంఆర్డీఏ పలు సంస్థలతో కలసి అధ్యయనం చేసింది. నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చి, ఆంధ్ర విశ్వవిద్యాలయం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీతో పాటు స్థానిక మత్స్యకారులతోను కలిసి మాట్లాడింది. విశాఖపట్నంలో 28.81 కి.మీ. పొడవున తీరం కోతకు గురవుతున్నట్టు గుర్తించింది. అదే విధంగా భీమిలి మార్గంలో మరో 46.2 కి.మీ. పొడవున తీరం ఓ మోస్తరుగా కోతకు గురవుతున్నదని తేల్చింది. విశాఖపట్నంలో గత ఐదు దశాబ్దాల్లో 60 వరకు తుఫాన్లు వచ్చాయని, వాటిలో 40 తీవ్రమైన నష్టం కలిగించాయని నివేదించింది. తుఫాన్లకు అలలు తీరాన్ని భారీగా తాకి పెను నష్టం కలిగిస్తున్నాయని పేర్కొంది. దీనివల్ల విశాఖలో కురుసుర సబ్మెరైన్, టీయూ-142 మ్యూజియం, గోకుల్ పార్క్, ప్రముఖ హోటళ్లు, బీచ్రోడ్డుతో పాటు మత్స్యకారుల ఆస్తులకు నష్టం జరుగుతున్నదని వెల్లడించింది. వీటి వల్ల 30 తీరప్రాంత గ్రామాలు, 60 వేల మంది జనాభా ప్రభావితం అవుతున్నారని నివేదించింది. 30 ప్రాంతాల్లో తీరం కోతకు గురవుతున్నదని పేర్కొంటూ అందులో ఆర్కే బీచ్ అధికంగా నష్టపోతున్నదని వివరించింది. పెదజాలరిపేట, మంగమారిపేట, భీమిలి...ఆ తరువాత స్థానంలో ఉన్నాయని, మిగిలిన 26 గ్రామాలకు వరదలు వచ్చినప్పుడు నష్టం జరుగుతున్నదని వెల్లడించింది.

**ఢిల్లీలో సమావేశంలో చర్చ**

వీఎంఆర్డీఏ చేసిన ప్రతిపాదనపై ఢిల్లీలో కేంద్ర హోం శాఖ సెక్రటరీ, ఎన్డీఎంఏ అధికారులు గురువారం సమీక్ష నిర్వహించారు. దీనికి వీఎంఆర్డీఏ నుంచి జాయింట్ కమిషనర్ రమేశ్, ఎస్ఈ భవానీశంకర్లు హాజరు కాగా, విశాఖ నుంచి కమిషనర్ తేజ్భరత్, సీఈ వినయకుమార్ వర్చువల్గా హాజరయ్యారు. పర్యాటకంగా దేశంలో ప్రజాదరణ పొందుతున్న విశాఖపట్నంలో తీరం కోత నివారణ అవశ్యమని, నిధులు మంజూరు చేయాలని అధికారులు కోరగా హోం శాఖ సూత్రప్రాయంగా అంగీకరించింది. వచ్చే సమావేశంలో దీనిపై నిర్ణయం వెల్లడిస్తామని పేర్కొంది.

# వైసీపీ నేత భూ మేత

**ఆనందపురం, విశాఖసమాచారం:** ఆనందపురం, అనకాపల్లి జిల్లాకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఒకరు ఆనందపురం మండలంలో ప్రభుత్వ భూముల కబ్జాకు తెగబడ్డారు. కొండలను తొలిచి, గెడ్డలను పూడ్చి తమ భూములకు దర్జాగా రహదారి నిర్మించుకున్నారు. అడ్డుకోవలసిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

విశాఖ జిల్లా ఆనందపురం మండలంలోని ఒక సర్పంచ్ (వైసీపీ) నాలుగు కొండల నడుమ గల కుసులువాడ పంచాయతీ ఇచ్ఛాపురం గ్రామంలో గిరిజనులను అదిరించి, బెదిరించి కొన్నేళ్ల క్రితం వారి భూములను (సుమారు 15 ఎకరాలు) కొనుగోలు



చేశారు. ఆ చుట్టుపక్కల గల ప్రభుత్వ భూములను, గెడ్డలను కూడా కలిపేసుకున్నానే ఆరోపణలు ఉన్నాయి. ఐదేళ్ల క్రితం ఆ భూములను అనకాపల్లి జిల్లాకు చెందిన ఒక వైసీపీ ఎమ్మెల్యే (ప్రస్తుతం మాజీ)తో పాటు నెల్లూరు జిల్లా వాసి కొనుగోలు చేశారు. లేఅవుట్ వేసేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. అయితే ఆ భూములకు సరైన దారిలేదు. కొద్దికాలం కిందట పక్కనున్న అటవీ భూమిలో రోడ్డు వేసేందుకు యత్నించడంతో కేసు నమోదు వరకూ వెళ్లింది. అయినా వెనక్కి తగ్గకుండా నెల రోజులుగా దాని పక్కనున్న సర్వే నంబరు 37లో గల కొండను తొలిచి, గెడ్డలను పూడ్చి సుమారు 80 అడుగుల రోడ్డును నిర్మించేశారు. ఆ రోడ్డు నిర్మాణానికి రెవెన్యూ, పంచాయతీ అనుమతులు లేకపోవడం గమనార్హం. కూటమి పాలనలో వైసీపీ నాయకులు బరితెగించి ప్రభుత్వ భూమి కబ్జా చేయడం విస్తుగొలుపుతుంది. కాగా కొంతమంది స్థానికులు అందించిన సమాచారం మేరకు శుక్రవారం రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. పెద్దఎత్తున కొండను తవ్వి రోడ్డు నిర్మించినట్టు నిర్ధారించారు. ఈ విషయమై స్థానిక తహశీల్దార్ శ్రీనుబాబును వివరణ కోరగా పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆ రోడ్డు నిర్మాణానికి రెవెన్యూపరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

**భూ కబ్జా చేయడానికి చూస్తున్నారు.**

రోడ్డు నిర్మాణం కోసం తన భూమిని విక్రయించలేదని కబ్జా చేయడానికి చూస్తున్నారని గ్రామానికి చెందిన వరపుల లక్ష్మి ఆరోపించారు. తమకు పెద్దల వద్ద పలుకుబడి ఉందని, అవసరమైతే భూమిలో నుంచి వెళ్లగొడతామని బెదిరిస్తున్నారని వాపోయింది. వారి నుంచి రక్షణ కల్పించాలని కోరింది.

# అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం



**పైడిమెట్ట విశాఖసమాచారం:** మండల పరిషత్ బేసిక్ ప్రాథమిక పాఠశాల పైడిమెట్ట నందు శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించబడినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దున్నా దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అంతర్జాతీయ మాతృభాషా గురించి వివరించారు. ఈ ప్రపంచంలో తల్లి పాల తర్వాత అంత తియ్యనైనది మాతృభాష. ఈ సృష్టిలో ఎన్నో జీవరాశులు ఉన్నా అత్యంత ఉన్నతమైన భావవ్యక్తీకరణ నైపుణ్యం కలిగి ఉన్నది మాత్రం మానవుడే. అటువంటి మానవుడు తొలుత మాట్లాడేది తన మాతృభాషలోనే. ఎక్కడైతే మాతృభాష గౌరవించబడుతుందో అక్కడ సంప్రదాయాలు వెల్లువిరిస్తాయి. మన మాతృభాష తెలుగు. దేశ భాష లందు తెలుగు లెస్స అని మన భాష కీర్తించబడిన భాష మనది అని వివరించారు. అనంతరం విద్యార్థులు తెలుగు అక్షరాలు, అచ్చులు, హల్లులు, గుణింతాలు, పొడుపు కథలు, జాతీయాలు, సామెతలు, పద్యాలు, కవితలతో అలరించారు. అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయుడు ధర్మాన రాము, విద్యార్థులు ఉన్నారు.

# ఇంటర్ పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని, ఎటువంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆదేశాలు ఇచ్చారు. శుక్రవారం తన ఛాంబర్లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ 85 కేంద్రాల్లో జరగనున్న పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 81 వేల మంది హాజరుకానున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటుచేసి 144 సెక్షన్ అమలుచేయాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని, నిరంతరం విద్యుత్, హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఇంటర్ బోర్డు పర్యవేక్షణాధికారి మురళీధర్ మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం పరీక్షలు 40,165 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 40,836 మంది రాస్తున్నారన్నారు. ప్రథమ, ద్వితీయ ఏడాది విద్యార్థులకు రోజు తప్పించి రోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. సమీక్షలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు







## ఆడియన్స్ ని మోసం చేయడం అంత ఈజీ కాదు?





సినిమా ఇండస్ట్రీలో ఇప్పుడు ప్రమోషన్లు అనేవి ఒక పెద్ద ఛాలెంజింగ్ గా మారాయి. ఒకప్పుడు సినిమా బాగుంటే చాలు అనుకునేవారు కానీ ఇప్పుడు జనం దాకా ఆ విషయం తీసుకెళ్లడం కోసం కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. అయితే ఈ క్రమంలో కొంతమంది మేకర్స్ అవసరానికి మించి హడావిడి చేస్తూ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించాలని చూస్తున్నారు. కానీ నేటి తరం ఆడియన్స్ చాలా స్మార్ట్. ఏది కంటెంట్ కోసం చేస్తున్న ప్రమోషన్, ఏది కేవలం హైప్ కోసం చేస్తున్న మాయ అనేది వాళ్లు ఈజీగా పసిగట్టేస్తున్నారు

కేవలం సోషల్ మీడియాలో వచ్చే పాజిటివ్ కామెంట్లను చూసి మోసపోయే రోజులు ఇప్పుడు లేవు. మరోవైపు ప్రమోషన్లు అస్సలు చేయకపోవడం కూడా సినిమాలకి శాపంగా మారుతోంది. కథలో దమ్ముండి, నటీనటులు బాగా చేసినా సరే సరైన పబ్లిసిటీ లేక చాలా సినిమాలు థియేటర్లలో వెలవెలబోతున్నాయి. ఆ సినిమాలు థియేటర్ల నుంచి వెళ్ళిపోయిన తర్వాత ఓటీటీలోనో లేదా టీవీలోనో చూసి అప్పుడు ప్రేక్షకులు సోషల్ మీడియాలో బాధపడుతుంటారు.

ఇంత మంచి సినిమాను ప్రమోట్ చేయడంలో మేకర్స్ ఫెయిల్ అయ్యారని, ముందే తెలిసి ఉంటే థియేటర్లోనే చూసేవాళ్లమని కామెంట్స్ చేయడం మనం తరచూ చూస్తుంటాం. ప్రమోషన్లకు భయపడి వెనకడుగు వేయడం వల్ల ఒక మంచి సినిమా జనాలకు రీచ్ కాకుండా పోతోంది. ప్రమోషన్ల కోసం ఖర్చు చేసే విషయంలో మేకర్స్ ఇప్పుడు రెండు కోణాల్లో ఆలోచించాల్సిన అవసరం ఉంది. కేవలం ఫేక్ రివ్యూల మీద ఇన్వెస్ట్ చేయడం వల్ల లాంగ్ రన్ లో ఎటువంటి ఉపయోగం ఉండదు. ఆ హడావిడి చూసి సినిమాకి వచ్చిన ఆడియన్స్ థియేటర్లో డిజప్పాయింట్ అయితే దాని ప్రభావం చాలా దారుణంగా ఉంటుంది. అందుకే మేకర్స్ తాము చేసే ప్రమోషన్లు సినిమాలోని అసలైన సోల్ ని టచ్ చేసేలా ఉండేలా చూసుకోవాలి. అనవసరమైన ఆర్భాటాల కంటే జెన్యూన్ గా సినిమాని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడం మీద ఫోకస్ చేయాలి. కొత్త వాళ్లు లేదా చిన్న బడ్జెట్ సినిమాలు చేసే వాళ్లకు ఈ ప్రమోషన్లు అనేవి ఒక కత్తి మీద సాము లాంటివి. స్టార్ కాస్ట్ లేనప్పుడు సినిమా మీద అటెన్షన్ రావాలంటే కచ్చితంగా ఏదో ఒక వెరైటీ పబ్లిసిటీ స్టంట్ చేయాల్సి వస్తోంది. అయితే అది లిమిట్ లో ఉన్నంత వరకు బాగుంటుంది. కానీ ప్రతి సినిమాను మాస్టర్ పీస్ అని ముందే ఫిక్స్ చేసేయడం వల్ల ఆడియన్స్ లో ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగిపోయి చివరకు సినిమాకి నష్టం జరుగుతోంది. ఇలాంటి బ్యాలెన్స్ తప్పినప్పుడు ఎంత గొప్ప కంటెంట్ ఉన్నా ప్రేక్షకులు దాన్ని అంగీకరించడం కష్టమవుతుంది. నిజానికి ఆడియన్స్ సినిమా చూసి ఇచ్చే రివ్యూ కి ఉన్న వాల్యూ ఏ ప్రమోషన్ కి ఉండదు. థియేటర్ నుండి వచ్చిన ఒక సామాన్యుడు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ మిగతా వంద మందిని థియేటర్ కి రప్పించగలదు. మేకర్స్ కూడా ఈ విషయాన్ని గుర్తుంచుకుని జెన్యూన్ మౌత్ టాక్ వచ్చే వరకు వెయిట్ చేయాలి. సోషల్ మీడియాలో కనిపించే లైకులు, షేర్లు సినిమాలను హిట్ చేయలేవు. సినిమా కథలో ఆడియన్స్ ని కట్టిపడేసే మ్యాజిక్ ఉంటే ఆటోమేటిక్ గా అదే టాక్ ఆఫ్ ది టౌన్ అవుతుంది.

## ఆ రెండు కటౌట్ల మధ్య పాన్ ఇండియాలో పోటీ!



ప్రభాస్ ఇమేజ్ ఇప్పటికే పాన్ ఇండియాను దాటి పాన్ వరల్డ్ కి రీచ్ అయింది. చైనా, జపాన్, మలేషియా సహా ప్రపంచ దేశాల్లో డార్లింగ్ ఫాలోయింగ్ అసాధారణం. ప్రభాస్ బర్త్ డే వచ్చిందంటే? ఆ పుట్టిన రోజును హైదరాబాద్ వచ్చి డార్లింగ్ ఇంటి ముందు సెలబ్రేషన్ చేసే రేంజ్ కి డార్లింగ్ రీచ్ అయ్యాడు. ఈ విషయంలో ఇప్పటికే ప్రభాస్ కి పోటీగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ తయారయ్యాడు. జపాన్ లో తారక్ ను అభిమానించే వారెంతో మంది ఉన్నారు. తారక్ ఏ దేశం వెళ్తే అక్కడ జపాన్ అభిమానులు వాలిపోవడం అన్నది చూసాం. ఇలా తారక్-ప్రభాస్ మధ్య ఈ రకమైన పోటీ ఉంది.

అయితే కటౌట్ , కంటెంట్ విషయంలో మాత్రం ప్రభాస్ కు పోటీగా మహేష్ మారే అవకాశం ఉంది. సరైన యాక్షన్ కటౌట్ ఉన్న హీరో ఎవరు? అంటే అది ప్రభాస్ మాత్రమే. అతడి కటౌట్ ని ఆధారంగా చేసుకునే ప్రశాంత్ నీల్ -సలార్- లాంటి ప్రాజెక్ట్ మొదలు పెట్టాడు. -సలార్- లో యాక్షన్ సన్నివేశాల్లో డార్లింగ్ కటౌట్ కు ఏ రేంజ్ లో సెట్ అయ్యాయో తెలిసిందే. తొలి భాగం సీజ్ ఫైర్ లో ప్రభాస్ యాక్షన్ ఓ రేంజ్ లో హైలైట్ అవుతుంది. -సలార్ 2- లో అంతకు మించిన యాక్షన్ ఎపిసోడ్స్ ఉండబోతున్నాయి. ఈ కథ ప్రభాస్ కు తప్ప మరే స్టార్ కు సూటవ్వదన్నది వాస్తవం.

హైట్ పరంగా సూపర్ స్టార్ మహేష్ మాత్రం ప్రభాస్ కు సరి తూగుతాడు. కటౌట్ క్లాస్ అయినా? రూపంలో భారీ మార్పులు తీసుకొస్తే? మహేష్ మాస్ అప్పిరియన్స్ పీక్స్ లోనే ఉంటుంది. అలాంటి సమయంలో మహేష్ కి మాస్ కాన్సెప్ట్ ఒకటి పడితే? అదే రేంజ్ లో హైలైట్ అవుతాడు. -వారణాసి-తో పాన్ ఇండియా మార్కెట్లోకి ఎలాగూ అడుగు పెడుతున్నాడు. ఇదే సినిమాతో ఇంటర్నేషనల్ మార్కెట్ కి కనెక్ట్ అవుతున్నాడు. ఈ ఒక్క చిత్రంతోనే మహేష్ గ్లోబల్ మార్కెట్ కి రీచ్ అవుతాడు. అదే జరిగితే ప్రభాస్ కు పోటీ తప్పనట్లే. బాక్సాఫీస్ వద్ద నెంబర్ల వేట తప్పదు.

గతంలో వీరి మధ్య మార్కెట్లో పోటీ 100 – 200 కోట్ల వద్ద ఉండేది. కానీ మహేష్ – రాజమౌళి సినిమా 2000 కోట్ల మార్కును లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభాస్ సినిమాలు కూడా 1000 నుండి 1500 కోట్ల రేంజ్‌లో బిజినెస్ చేస్తున్నాయి. అంటే భారతీయ సినిమా చరిత్రలో అత్యధిక వసూళ్లు సాధించిన మొదటి రెండు స్థానాల కోసం వీరిద్దరి మధ్య గట్టి పోటీ ఉంటుదన్నది స్పష్టమవుతోంది. ప్రభాస్ ఎన్నో పాన్ ఇండియా సినిమాలు చేసి సంపాదించుకున్న క్రేజ్ ను మహేష్ ఒక్క సినిమాతోనే ప్లాన్ చేసాడు. ఇదంతా రాజమౌళి వల్లే సాధ్యమవుతుంది.

## శంకర్ ఫౌండేషన్ కు ఆప్టికల్ బయోమీటర్లు

### విరాళముగా ప్రధానము చేసిన ఎం ఎస్ టి సి


భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వ శాఖ పరిధిలోని మినీ రత్న కేటగిరీ-1 PSU అయిన మెటల్ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ (MSTC) లిమిటెడ్, కార్పొరేట్ సామజిక బాధ్యతలో భాగముగా శంకర్ ఫౌండేషన్కు 31 లక్షల రూపాయల విలువైన ఆప్టికల్ బయోమీటర్లు విరాళంగా ఈ రోజు ప్రధానము చేసారు. ఈరోజు శంకర్ ఫౌండేషన్ ప్రధాన ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమములో ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ V గణేష్ మూర్తి , శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సిట్ A కృష్ణ కుమార్ మరియు మీూజ అధికారుల సమక్షంలో ఈ పరికరాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవం చేస్తూ, నివారించదగిన అంధత్వాన్ని ఎదుర్కోవడంలో శంకర్ ఫౌండేషన్ అంకితభావంతో చేసిన ప్రయత్నాలను శ్రీ గణేష్ మూర్తి ప్రశంసించారు. ఆసుపత్రి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో మీూజ మద్దతును శ్రీ A కృష్ణ కుమార్ ప్రశంసించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ T. రవీంద్ర, డాక్టర్ T. కృష్ణ, డాక్టర్ శిరీష, డాక్టర్ సుపర్ణ, శ్రీ బి శ్రీనివాస రావు , చీఫ్ జనరల్ మేనేజర్ , హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ , మీూజ అధికారులు శ్రీ నరేంద్ర మోహన్ (DGM, ఫైనాన్స్), శ్రీ హరీష్ కుమార్, మేనేజర్ (ఫైనాన్స్), శ్రీ నాగరాజ రావు, మేనేజర్ (ఆపరేషన్స్), శంకర్ ఫౌండేషన్ తరుపున శ్రీ వి. రమేష్ కుమార్ (DGM, కార్పొరేట్ రిలేషన్స్ & పేషెంట్ కేర్), శ్రీ కె. బంగార్రాజు (DGM PR & లైజన్), శ్రీ SKL. రావు (AGM HR), శ్రీమతి శృతి పాల్గొన్నారు.

ఆప్టికల్ బయోమీటర్లు గురించి: ఆప్టికల్ బయోమీటర్ అనేది అత్యున్నత స్థాయి పరికరం, ఇది అక్షసంబంధ పొడవు, కార్నియల్ వక్రత మరియు పూర్వ గది లోతు వంటి కంటి యొక్క క్లిష్టమైన శరీర నిర్మాణ సంబంధమైన కొలతలను అసాధారణమైన ఖచ్చితత్వంతో కొలుస్తుంది. సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే, ఇది వేగవంతమైన, సురక్షితమైన , మరింత ఖచ్చితమైన ఫలితాలను అందిస్తుంది, కంటిశుక్లం మరియు వక్రీభవన విధానాలలో శస్త్రచికిత్స ప్రణాళిక మరియు ఫలితాలను బాగా మెరుగుపరుస్తుంది.



**శ్రీ వి. గణేష్ మూర్తి, బ్రాంచ్ మేనేజర్ (4వ నుండి ఎడమ వ్యక్తి) ,శ్రీ కృష్ణ కుమార్, మేనేజింగ్ ట్రస్టీ మరియు ఇతరుల సమక్షంలో పరికరాలను ప్రారంభిస్తున్నారు.**

## ఎస్టీ సెల్ జోన్. వన్ ప్రెసిడెంట్గా కొండ గొర్రె ఉదయ్



**సాలూరు విశాఖ సమాచారం**: వైయస్సార్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం సాలూరు మండలం తోనాం పంచాయతీ మెట్టవలస గ్రామానికి చెందిన యువకుడు విద్యావంతుడు కొండ గొర్రె ఉదయ్ కుమార్ ను నియమించారు మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర. తన నివాస గృహం వద్ద శనివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వ్యక్తులకు ఎప్పుడు గౌరవం ఉంటుందని వారి సేవలను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గుర్తించి గిరిజన యువకులు బిసి యువకులు ఓసి యువ నాయకులు పార్టీ కార్యకర్తలను వైయస్సార్ పార్టీ గుర్తించడం జరుగుతుందని అన్నారు దానికి నిదర్శనం కొండ గొర్రె ఉదయ్ కుమార్ రాష్ట్ర ఎస్టీ సెల్ జోన్. 1 ప్రెసిడెంట్ గా నియమించారని అన్నారు అదేవిధంగా రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా డోల బాబ్జి పాచిపెంట బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా జి మాధవరావు రాష్ట్ర వాణిజ్య పన్నుల విభాగం కార్యదర్శిగా ఉప్పల నాగేశ్వరరావు సాలూరు రాష్ట్ర వైఎస్ఆర్ పార్టీ కార్యాలయం నుండి ఆదేశాలు రావడం జరిగిందని రాజన్న దొర తెలిపారు నియమితులు ఆయన ఉదయ్ రాజన్న దొర అభినందనలు తెలిపారు మండలంలో గిరిజన సర్పంచ్ మువ్వల ఆదయ్య గిరిజన నాయకులు వంటి అశోక్ అశోక్ తేజ నమలి పిట్ట కళ్యాణం ఉదయం రాజన్న దొర. నివాస గృహం వద్ద ఉదయకు సాలువులతో సన్మానం చేసి అభినందించారు ఉదయం మాట్లాడుతూ నా సేవలను గుర్తించి జగన్మోహన్ రెడ్డి పదవి ఇవ్వడం జరిగిందని రానున్న ఎన్నికల్లో పార్టీకి సైనికులుగా పనిచేసే పార్టీ విజయానికి కృషి చేస్తానని అన్నారు

## ఘనముగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు..




**విశాఖ సమాచారం**: స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్& కల్చరల్ అసోసియేషన్, రి.అధ్యక్షులు బల్లానాగభూషణము ఆధ్వర్యములో పట్టణంలో గల ఒన్ వే ట్రాఫిక్ జంక్షన్ వద్ద గల తెలుగు తల్లి విగ్రహం వద్ద ఘనముగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు.ముందుగా సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణము తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి తెలుగు తల్లికి పూలు, పండ్లతో పూజలు చేసి అనంతరం మాట్లాడుతూ మొట్ట మొదటిసారిగా 1999 స.ము.లో యునెస్కో వారు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రకటించడం జరిగిందని,అలాగే ప్రపంచంలో గల 711 భాషలలో తెలుగు భాష 18 వ స్థానము లో ఉందని, మరియు మన దేశములో గల 22 భాషలలో మన తెలుగుభాష 4 వ స్థానం లో ఉండటం ఎంతో గొప్ప విషయమని , ముఖ్యముగా మన తెలుగు భాష అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విషయాలలో ప్రాధాన్యత కల్పించి తెలుగు భాషా వ్యాప్తికి కృషి చేయాలని అన్నారు.రాష్ట్రములో గల ప్రభుత్వ మరియు ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీల పాఠ్య పుస్తకాల్లో తెలుగు భాషలో పాఠ్య పుస్తకాన్ని తప్పని సరిగా ఉండేలా తగు చర్యలు చేపట్టాలని అన్నారు.అలాగే ప్రపంచములో గల తెలుగు వారందరు కూడా తెలుగులో మాట్లాడు కొని మన మాతృభాష ఔన్నత్యాన్ని , తెలుగు భాష అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో తెలుగు భాషలో నే వ్రాత ప్రతులు ఉండేలా అధికారిక ఉత్తర్వులు చేయాలని విజ్ఞప్తి చేసారు. తెలుగు భాష వ్యాప్తికి ఎంతో కృషి చేసిన శ్రీ గిడుగు రామ మూర్తి పంతులు గారికి, కందుకూరి వీరేశలింగం పంతులు గారికి, గురజాడ అప్పారావు గారికి, మహాభారతంను తెలుగు భాషలో అనువదించిన మహనీయ కవిత్రయం శ్రీ నన్నయ తిక్కన ఎర్రా ప్రగడలకు, తెలుగు భాష అంతర్జాతీయ వ్యాప్తికి అవిరళ కృషి సల్పిన శ్రీ ఎన్.టి.రామారావు గార్లకు ఈ సందర్భముగా నివాలు లర్పించారు.ఈ కార్యక్రమములో సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణం, కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, సభ్యులు అయ్యగారు వెంకట రమణ మూర్తి, జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బుగిడి నూక అప్పారావు, రామాలయ సంస్థ సభ్యులు బత్తుల శ్రీనివాసరావు, నడిగట్ల సూరి బాబు, కొనుతుల నూకరాజు, ఎన్నేటి సత్యారావు, కాలేజీ విద్యార్థినులు పాల్గొన్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com